

బివివి ప్రసాద్

# హైకూలు

# బివివి ప్రసాద్
# హైకూలు

హైకూ సంపుటాలు:

దృశ్యాదృశ్యం

హైకూ

పూలురాలాయి

ఇంకా..

హైకూ పై వ్యాసాలూ, ఇంటర్వ్యూ

***BVV Prasad Haikoolu***
*Telugu Haiku*
*by* ***B.V.V. Prasad***

© : Poet
EBook Edition : Sep 2011
Cover Design : Ramana GV

Poet's Address : B.V.V.Prasad
# 23-12-21, Sajjapuram
TANUKU W.G.Dt 534 211

Mobile : 90320 75415

Email : prasadbvv1@gmail.com

Websites : facebook.com/BVVPrasad
picasaweb.google.com/prasadbvv1
bvvprasad.blogspot.com

# క్రమసంఖ్య


కవి పరిచయం 5

హైకూ సంపుటులు :

దృశ్యాదృశ్యం 7

హైకూ 33

పూలురాలాయి 65

హైకూ తత్వం :

చంద్రుణ్ణి చూపించే వేలు: శ్రీ ఇస్మాయిల్ 108
(దృశ్యాదృశ్యం ముందుమాట)

లహరి: డా. శ్రీ సంజీవదేవ్ 113
(దృశ్యాదృశ్యం ముందుమాట)

ప్రకృతీ జీవితం హైకూలమయమే: బివివి ప్రసాద్ 116

హైకూ అంటే జీవనస్పృహ: బివివి ప్రసాద్ 121

హైకూ అంటే ఏమిటి?: బివివి ప్రసాద్ 132
(శ్రీ నాగసూరి వేణుగోపాల్ రేడియో ఇంటర్వ్యూ)

మౌనానికి ముందుమాట: బివివి ప్రసాద్ 140
(శ్రీ గోపిరెడ్డి రామకృష్ణారావు 'వెన్నెలగా వుంది' ముందుమాట)

ప్రసిద్ధ కవయిత్రి శ్రీమతి ఓల్గా ప్రతిస్పందన.. 143

## కవి పరిచయం

బొల్లిన వీరవెంకట ప్రసాద్ పూర్వులు తణుకు సమీపంలోని ముక్కామల, సూర్యారావుపాలెం గ్రామాలలో రైతు కుటుంబాలకు చెందిన శ్రీ బొల్లిన వీరన్నగారు, శ్రీ భోగవల్లి సుబ్బారావుగారు. తల్లిదండ్రులు శ్రీమతి విజయలక్ష్మి, శ్రీ అచ్యుతం. వీరికి ప్రసాద్ తరువాత ఇద్దరు పిల్లలు నాగేంద్రకుమార్, శ్రీ భవాని. తండ్రిగారు కొంతకాలం చాగల్లులో ఉద్యోగం చేసి, 78లో తణుకులో వ్యాపారం ప్రారంభించి, స్థిరపడ్డారు.

21 నవంబరు 66న పుట్టిన ప్రసాద్ బాల్యం మాతామహులు, నలుగురు మేనమామల ఉమ్మడి కుటుంబంలో గడిచింది. తరువాత తల్లిదండ్రుల వద్ద, ఏడవతరగతి వరకూ చాగల్లులోనూ, బికాం రెండవ సం. వరకూ తణుకులోనూ, చివరి సం. కాకినాడలోనూ, సి.ఎ. చేసే ప్రయత్నంలో ఒక సం. మద్రాసులోనూ చదువూ, జీవితమూ గడిచాయి. 91లో మాలతితో వివాహమైంది. గాయత్రి, భార్గవి వీరి సంతానం. చదువు తరువాత చాలాకాలం తండ్రిగారికి వ్యాపారంలో సహాయంగా ఉండి, 2003 నుండి మూడేళ్ళు తణుకులో స్కూలు నడిపి, నష్టాలతో విరమించుకొని, మళ్ళీ తండ్రిగారి వ్యాపారంతో కాలం గడుపుతున్నారు.

సున్నితమైన స్వభావం, లోతైన అన్వేషణ, తగినంత ఆర్ద్రత, నిజాయితీ, చేసేపని ప్రాణం పెట్టి చేయటం, నచ్చనివాటిని తీవ్రంగా వ్యతిరేకించటం, లేదంటే వాటికి వీలైనంత దూరంగా ఉండటం, ఇతరులలో మరిన్ని మానవీయవిలువలు ఆశించి తరచూ నిస్పృహ చెందటం తన వ్యక్తిత్వంలో ముఖ్యమైన లక్షణాలుగా గమనించిన ప్రసాద్, సరైన కారణం తెలియని లోలోపలి వెలితి ఒకటి తన జీవిత గమనాన్ని శాసిస్తుందని భావిస్తారు. దానినే డిమాండ్ ఫర్ ఎక్సలెన్స్ అని కూడా అనుకోవచ్చునని, అది బహుశా అందరిలోనూ ఉంటుందని, దానిని గుర్తించే సున్నితత్వం, వ్యవధి, అంతర్ముఖీనత ఉండాలని అంటారు.

సుమారు పదేళ్ళ వయసునుండీ పుస్తకాలంటే అమిత ఇష్టమైన ప్రసాద్, తెలుగులో దొరికిన సాహిత్యం, ముఖ్యంగా కథా, వ్యాస సాహిత్యం ఎక్కువగా చదివారు. శరత్, శ్రీశ్రీ, చలం, టాగోర్, టాల్‌స్టాయ్, సంజీవదేవ్ తన ఆలోచనలని, ఊహా ప్రపంచాన్ని, ఉద్వేగాలని ప్రభావితం చేసినవారిలో కొందరు. డిగ్రీ చివరి సం. 86లో, చలం రాసిన భగవాన్ స్మృతులు, వెలుగురవ్వలు చదవటం, సాహిత్యం వలన తనకు జరిగిన ముఖ్యమైన మేలుగా భావిస్తారు. భగవాన్ శ్రీ రమణమహర్షి అతి సరళజీవనం, సూటిగా, స్పష్టంగా ఉండే ఆయన బోధనలూ తనకు జీవితంలోని

అనేక విషయాల పట్ల స్పష్టతనీ, సరైన స్పందనలనీ కలిగించాయని తలుస్తారు. పుస్తకాల తరువాత ప్రకృతి, స్నేహితులూ, ప్రయాణాలూ, ఫొటోగ్రఫీ, సంగీతం, సినిమాలూ తన సృజనాత్మక సహచరులు.

స్కూలు చదువులో చిత్రకళతో మొదలైన సృజనాత్మక వ్యాసంగం, కాలేజీ చదువునుండీ కవిత్వంవైపుగా తిరిగింది. 89లో ఆరాధన సంపుటి ప్రచురించే నాటికి కవిత్వం, కథలు, సాహిత్య, తత్వ చింతనలతో కూడిన ఏడెనిమిది నోట్‌బుక్స్ రాసుకొన్నారు. రసాత్మకత, గాఢమైన అనుభూతి, సంక్షిప్తత కవిత్వరచనకి ముఖ్యమని భావించే ప్రసాద్, తన స్వభావానికి హైకూ ప్రక్రియ దగ్గరగా ఉండటంతో 95, 97, 99లలో వరుసగా దృశ్యాదృశ్యం, హైకూ, పూలురాలాయి హైకూ సంపుటాలు ప్రచురించారు. ప్రసాద్ హైకూలు, హైకూపై వ్యాసాలూ తెలుగు హైకూ సాహిత్యంలో ఉత్తమమైనవిగా ప్రసిద్ధిపొందాయి. తరువాత వచనకవిత్వంలో తన శైలిని కనుగొనే ప్రయత్నంలో భాగంగా రాసిన కవితలతో 2006లో నేనే ఈ క్షణం ప్రచురించారు.

అనేక దేశకాలాలకు చెందిన జ్ఞానుల మాటలని వర్తమాన జీవితంతో సమన్వయించుకొంటూ, అధ్యయనం చేయటం మానవ వికాసానికి దోహదం చేస్తుందని భావించే ప్రసాద్, వ్యక్తీ - సమాజమూ, బుద్ధీ – హృదయమూ, జీవితమూ – అంతిమ సత్యమూ పరస్పర వ్యతిరేకాలు కావని, స్త్రీ – పురుష శక్తులవలే పరస్పర పూరకాలనీ, జాతుల, మతాల, ప్రాంతాల సంస్కృతుల సారాన్ని గ్రహిస్తూ, ఒక మహామానవ సంస్కృతి విస్తరించాలని, ఎవరి జీవితమని కాకుండా, అందరం మొత్తం జీవితం పట్ల బాధ్యత కలిగి స్పందించాలని, ఆలోచించాలని, వికసించాలని కలగంటారు.

సాహిత్యం పట్ల ప్రజలలో క్షీణిస్తున్న ఆసక్తీ, దానికి దారితీసిన, ఉదాత్తత, నిజాయితీ లోపిస్తున్న సాహిత్యకారుల ఇరుకిరుకు వాదప్రతివాదాలూ; సాంకేతిక పరిణామాలూ, అనేక ఇతర కారణాల వల్ల పొడిబారుతున్న మానవ సంబంధాలూ; వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకులూ – వీటన్నిటితో సృజనకి దూరంగా చాలా సంవత్సరాలు గడిచాక – జీవితం పట్ల మరింత స్పష్టతా, ఇష్టతా ఏర్పడుతున్న దశలో – క్షీణిస్తున్న మానవవిలువల పట్ల వ్యధచెందే అక్కడక్కడి మిత్రులను చూసి, ముఖ్యంగా కొందరికైనా తన మాటలు ఓదార్పునీ, స్పష్టతనీ, బలాన్నీ ఇవ్వటం గమనించి, తనకు అర్థమైన జీవితాన్ని ఇతరులతో పంచుకోవటం కోసం 2010–11లలో సుమారు నాలుగు నెలల కాలంలో రాసిన కవిత్వంతో 2011లో ఆకాశం సంకలనం తీసుకువచ్చారు.

# దృశ్యాదృశ్యం

## హైకూలు

బి.వి.వి. ప్రసాద్

రచనాకాలం: 1991–95
ప్రథమముద్రణ: ఏప్రిల్ 1995

అంకితం

అమ్మ శ్రీమతి విజయలక్ష్మికి
నాన్న శ్రీ బొల్లిన అచ్యుతంగారికి
ప్రేమతో..

వర్షం
క్షణం పూచే నీటిపూలతో
ఊరు నిండిపోయింది

ఓ క్షణం జీవించాను
అలపై చిట్లిన
వెన్నెలను తాకబోయి

రంగుల పిట్ట
మనసు కాన్వాసుపై
రంగులు పులిమేస్తుంది

దూరంగా దీపం
దానిని కాపాడుతూ
అంతులేని చీకటి

పడవ కదలటం లేదు
నీడనైనా తనతో రమ్మని
కాలువ లాగుతోంది

కురిసిన ఆనవాలుకేమో
మబ్బులు
పల్లాలలో సంతకాలు చేసాయి

ఉరుము
వానతీగల్ని బిగించి
మేఘం శృతి చూసుకొంది

చలికి వణుకుతూ
కాలువలో
వంతెన

నక్షత్రాలు
ఆకాశం ఒడిలో
చీకటి శిశువు కబుర్లు

పిల్లలు
కేరింతల వర్షం
ఆకాశం తడిసింది

గోడలో పూచిన పూవు
పరిచయం చేసింది
మా గోడని

రాత్రి ఆకాశం
వెన్నెలకు తడుస్తూ
వెన్నెలకు ఆరుతూ

చెట్టు
కాలువలో కవలపిల్లకి
నీడని పడుతూ

చినుకు శిశువు స్పర్శ
చెరువు దేహం
పులకరించింది

పథికుని పలకరింపుకై
చూసి, నవ్వి, చిన్నబోయిన
వీధి దీపం

నల్లని కాన్వాసుపై
మరింత నల్లని చిత్రాలయి
ఇళ్ళూ, చెట్లూ

సముద్రతీరం
లోకం అంచున నిలిచి
ప్రాణం నింపుకొంటున్నాను

హిమాలయాలు
మార్మిక పరిమళాలు వీచే
మల్లెపూలు

ఆలోచన హాయిగా ఓడింది
పిల్లలకీ
పిట్టలకీ

గుండ్రంగా స్వప్నించిన నీటిబుడగ
కాలువ మెలకువలోకి
ఉలికిపడింది

నేల రాలిన పూవు
అడుగుతోంది
నిన్న నా నవ్వు చూసావా

పూవు పేరు చెప్పాను
అతని చూపులో
పూవు చెరిగి, పేరు మిగిలింది

మేఘం స్పందించింది
అంచులు లేని పేజీలో
అక్షరాలు చల్లుతోంది

నీవు దారిని ప్రేమిస్తావు
దారుల్ని తెరిచిన మట్టినీ
నేను ప్రేమిస్తాను

చినుకు
శరీరాన్ని మీటింది
సంగీత సముద్రంలో శరీరం

అతను
కనులు మూసుకు అరుస్తాడు
నన్ను చూడనీయండి

మృదంగ నాదం
జీవితం
వేళ్ళ చివర్ల గంతులేస్తుంది

శీతాకాలం
దుప్పటి లోంచి
ఎండ దుప్పటి లోకి

కాలేజీ
విద్యార్థులు లేరు
అధ్యాపకులూ లేరు

శరీరం సరిహద్దయితే
జీవితం
రక్తం చేసే యాత్ర

నిశ్చల క్షణం
ఎవరిని!
ప్రవాహంలా జీవితం

పరధ్యానంలో ఉన్నాను
సంధ్య నాట్యం ముగించి
వేదిక దిగిపోయింది

ఒక మూల వీణ
స్వరాల పూలను రాల్చి
విశ్రాంతిగా

కవులు
పెద్దయాక పరిచయమైన
బాల్య మిత్రులు

ప్రతివారి నవ్వూ
జీవితం చెక్కిన
సంతకాలతో

సూర్య మశకం
ఎండను గుచ్చి
నదిని పీల్చుతోంది

చినుకు నగ్నంగా సిగ్గుపడి
విత్తనంలోంచి
పచ్చదనం కప్పుకొచ్చింది

మన దారులలో
ఓ క్షణం
మన కనుల మృదుస్పర్శలో

మిణుగురులు
చీకటిలో
కదిలే కాంతిదీవులు

కవిత్వం నేత్రదానం
నేత్రాలపై
కలలు చెరుపుకోవాలి

వేదనచీకటి నుంచి
ఒక నిట్టూర్పు విహంగం
వేకువలోకి ఎగిరింది

ప్రాణం కాదు
మనిషి చిరునామా
కంట చెమరే నీరు

రాత్రి
చిటారు కొమ్మన
చందమామ వికసించింది

పసివాని స్నిగ్ధహాసం
కనులు మనని చూస్తున్నా
ఏ కాంతుల లోకాలలోనో చూపులు

హోలీ పండుగ
సంధ్య మబ్బులను
వెదుళ్ళలో నింపి చిమ్ముతున్నారు

స్కూలు బల్లలు
పిల్లల శుకపిక ధ్వనులలో
మునిగి

చేయి అడ్డుపెట్టాను
సూర్యునికి
కొంటెగా కాలువలోంచి నవ్వాడు

కొండవాలు పూలు
ఉప్పొంగే కెరటాలై
రంగుల్లో ముంచేశాయి

పూవూ లేదు
నేనూ లేను
సౌందర్యం ఆవరించింది

చెట్టు చెరువులో పడింది
కొమ్మని అందుకొంది
కానీ పైకి రాదు

పచ్చని నదిలా అరణ్యం
కనుల దోసిలి పట్టి
కరువుతీరా తాగాను

చలికి ముడుచుకొన్న
చెరువు పైన
వెన్నెల గిలిగింతలు పెడుతోంది

మరకలు
కానిది శిశుహాసం
కాలేనిది రుషిహాసం

పాట మంచుతీగై తాకింది
ముగిసేసరికి
తీగకు పూవునై రేకులు విచ్చాను

వినాలి
సౌందర్యం అరవదు
పిలుస్తుంది రహస్యంగా

కొండలు నీరు తాపాయి
ఉల్లాసంగా నది
కేరింతలు కొడుతోంది

నువు వస్తున్న సవ్వడి
నాలోని నవ్వు పరిమళాన్ని
మేలుకొల్పింది

సూర్యుడు విసిరిన
రాత్రిచీకటి
నీడల ముక్కలైంది

యుగాలు ప్రయాణించి వచ్చింది
వెలుగు రేక
లేత ఆకుని చుంబించటానికి

పక్షుల రెక్కలనిండా
స్కూలు పుస్తకాలు
ఇక ఎగరవు ఇక పాడవు

నదులై ప్రవక్తలు
మనం
చెరువులుగా

అన్నిటిలోంచీ వెలుగు
కవికి
జ్ఞానికి అంతా

మనలో మహావిశ్వం
మనలోనూ
మనమొక మూల

మబ్బునురగల స్నానమయాక
చెరువులో
మంచిబాలుడిలా చంద్రుడు

సగటు మనిషి
కన్నీటిచారలపై
ఎగప్రాకుతూ

ప్రాణం
విడిచే స్వేదం
కన్నీటిబిందువు

వాన ముఖంకడిగాక
ఆకాశం
నేల అద్దాలలో చూసుకొంటోంది

ఎపుడూ విస్మయంతో
పూలని నేనూ
నను పూలూ

సుడిగాలికి ఎగిరే ఆకు
చెట్టుతో
నీకన్నా ఎదిగానంటుంది

కరుణ
పరమ పావని
చివరిమరక

కాలం
అగ్నిధారయి స్పృశిస్తే
నీవొక వెలుగు

రాత్రంతా చీకటి కురిసింది
తెల్లవారేసరికి
ఊరినిండా నీడల కాలువలు

ప్రపంచం
వెలుతురు లో
రంగులమరకలు

యుగాల జీవనస్రవంతికి
అతిథిగా
ఆతిథేయునిగా

వ్యక్తిత్వం
ఒక వెలుగు
ఒక నీడ కూడా

శిశువు కేరింతలు
ఒక సెలయేరు
తుళ్ళిపడుతోంది

తటాలున మెరుపు
కంటిలోకి
కాంతిలోకి

మనసు తెరుచుకొని రాని
అందమైన చిరునవ్వు
చీకటిలో రంగులపూవు

శిశూదయం
ఒక మహా కావ్యం
ఆరంభం

అనాకారి
అర్థించింది
ప్రపంచాన్ని ప్రేమించవూ

అనుభూతుల సెలయేటిని త్రాగిన
నదితో
రోజూ నిద్రపోతాము

అక్షరం
మనకు వెల్తురుతునక
పిల్లలకు ముసిరే చీకటి

విశ్వవిస్ఫోటనంలో
ప్రాణం
వెలుగురవ్వ

మనిషిలో నివసించే
అమ్మపేరు
మానవత్వం

చీకటిగుప్పిటసందుల్నించి
జారిన కాంతిలా
ఇళ్ళలోంచి వెలుగు

తాత, మనవడు
జ్ఞాపకాలూ, కలలూ
ఆడుకొంటున్నాయి

దీపానికి జడిసిన చీకటి
నా వెనుక చేరి
భూతమై వెక్కిరిస్తోంది

తెప్పరిల్లాక
దిగులు
నైరూప్య చిత్రం

వేగానికి
తడి ఆరిపోతూ
మనిషి

కాలువ
చెట్టుని చెరుపుకోబోయి
పచ్చనిమరకలు పులుముకొంది

నాదైన ఏకాంతంలో
విశ్రాంతిలోకి
మేలుకొంటూ

కూలింది మహాస్వప్నం
ఫరవాలేదు
శిశువు తొలి అడుగు

ఒకటే వాన
చూరు నేలతో
ఒకటే కబుర్లు

ఆకాశంనిండా నల్లమబ్బు
స్తన్యమీయటానికి
తల్లి పైటకప్పింది

ప్రతిముఖం నుండీ
అవిరామంగా
జీవనసంగీతం

పౌర్ణమి
సముద్రం నురగమువ్వలతో
తాండవమాడుతోంది

లోని తటాకంలోకి
చినుకయి
ఓ రసవీక్షణ

వీధిదీపం
తల వంచుకొని
తనకాంతితో ఆడుకొంటూ

మంచుబిందువులు
నాలోకి
చిరునవ్వు వొంపుతున్నాయి

నాట్యం
ఆమె స్వరాలతో నిండి
పొర్లిపోతోంది

తెల్లని ఎండ
నియంతగా మారిన
వెన్నెల

సూర్యాస్తమయం
దిననేత్రం
అలసటగా రెప్పవాల్చుతోంది

చీకటిపడింది
దీపం
ఉలికిపడి కన్నుతెరిచింది

కాలువ ఒడ్డుని
చెరిపేసింది చీకటి
ఆకాశంలో వేలాడుతూ చెట్టు

చుక్కల మధ్యే
ఉంది భూమి
రాత్రి చెరువు చెప్పింది

తెల్లవారింది
నీడలింకా
నిద్రలేవలేదు

రాత్రి తారలు
నదినిండా కురిసాయేమో!
తీరమంతా ఇసుకమయం

మరణం
నీటిలో
ఒకరాత కరిగిపోయింది

పిట్ట
నింగినిండా పరుస్తోంది
వేల దారులని

కాలువలో
కాగితం పడవ
బాల్యాన్ని తీసుకువచ్చింది

లేత ఆకు
నాజూకుగా త్రాగుతోంది
ఆకుపచ్చని ఎండని

సాయంత్రం
వాడిపోయిన పగలు
రాలుతోంది చీకట్లోకి

అలల అంచులు
వెన్నెల నర్తిస్తోంది
వేల వేదికలపై

రంగులన్నీ పిట్టలే
తెల్లవారిందా
ఇక రెక్కలు విప్పుతాయి

అవిరామంగా కాలం నవ్వుతోంది
పూలనించి
లోకంలోకి

వీధుల్లో
వీరవిహారం చేస్తోంది
వాన సైన్యం

చీకటిని
పొడిపొడి చేస్తూ
బాటవెంట అడుగుల చప్పుడు

తుఫాను గాలి
మెరుపువేళ్ళు కదిలేలా
ఊగిపోతోంది వానచెట్టు

అందమైన పూవు ఇచ్చాను
అతను అన్నాడు
ఈ పూవుని ఏంచేయాలి

వాన వెలిసింది
తీగపై
చిన్ని ప్రపంచాలు వేలాడుతున్నాయి

# హైకూ

## హైకూలు

బి.వి.వి. ప్రసాద్

రచనాకాలం: 1995–97
ప్రథమముద్రణ: జూన్ 1997

అంకితం
పూలకీ
వెన్నెలకీ
సంజీవదేవ్‌కీ

ప్రేమతో..

ఓ సీతాకోక
చుట్టూ చేరాయి
నదీ, పర్వతాలూ

పిట్టలు కూస్తున్నాయి
గాలినిండా
రంగుల శబ్దాలు

వసంతం
చెట్లకి పూచాయి
పూలూ, ప్రేమలూ

రాయి నాటాను
కొలను కొలనంతా
తామరాకయింది

దూరంగా దీపం
బహుశా దానిచుట్టూ
ఒక గుడిసె

నిద్రపోయాను
చీకటిలో
చీకటిపడింది

మేఘం తొలగింది
చందమామ
క్షణం ఆగానేమో!

పొద్దుటి పొగమంచు
మేలుకొన్నట్టు
కలగంటున్నానా!

పాటబాగుంది
దూరంనించి వినిపించటం
ఇంకా బాగుంది

వానల్లోకూడా
వచ్చివెళతారేమో
సూర్యచంద్రులు!

చేయి పట్టుకొంది నిద్రలో
పాప కలలోకి
ఎలా వెళ్ళను

వెన్నెల నదిలో
ఒంటరిగా ఈదుతూ
చందమామ

తెల్లవారింది
రాలిన పూలమీద
మంచుమరకలు

చందమామ
నా బాల్యంలో
చాలా అందంగా ఉండేది

అనాథ బాలిక
జాలి దానంచేసి
వెళ్ళిపోతోంది

ఆటలో ఓడిపోయాను
ఆ పసివాడి
నవ్వు చూడాలని

నీటిపైన
రాలిన పూవుని
ప్రతిబింబం చేరుకొంది

మేలుకొన్నాను
కలలోని సూర్యబింబం
ఏ రోజు చూసింది

చదివిన కాలేజీ
అప్పటిలాగే
చెట్లనిండా పూలు

మేలుకొన్నాను
మరొకసారి
పాత ప్రపంచం

ఎంత అందంగా నవ్వింది
పాపాయికి చెప్పాలి
పెద్దయాక

తొలిజాము ప్రయాణం
ప్రవాహం మీద
పొగమంచు

పాపాయి
నా వక్షం తడిమి
ముఖంలోకి చూసింది

గాలి
పూలు ఊగాయి
వాటిపై సీతాకోకా

ఆమె వెళ్ళింది
గది విడవలేదు
పూలవాసన

రంగురంగుల పూలు
నీడలన్నీ
ఒకే రంగులో

కొన్ని గుర్తు రావటమే
హైకూ.
వెన్నెలా . .

పిట్ట ఎగురుతోంది
తన పొట్ట
రెక్కలతో పట్టుకొని

ఆకాశం
కొలనులో మునిగిందా
తేలిందా!

రెక్కలున్నాయి కదా
ఎగురు పిట్టా
నాకు రెండు కళ్ళున్నాయి

సూర్యగ్రహణం
నీలి కడవ మీద
ఎవరో మూత జరిపారు

కదిలే మేఘం
పర్వతంమీది నీడ
లోయలోకి జారింది

ఆమె వచ్చి అంది
'చందమామ'
మళ్ళీ నిశ్శబ్దం

ఆకాశం
నీరులేని సముద్రం
ఈదు నా భూమీ

వసంతం
పూలూ, ప్రశాంతతా
పిచ్చివాడు ఏం చూస్తున్నాడు

కొండలన్నీ చేరి
నదిని చెరిపేసాయి
సరస్సులో వున్నాం

ఈదుకొంటూ
వెళ్ళింది పిట్ట
కొలను చలించలేదు

ప్రవహిస్తున్నాయి
నిశ్శబ్దంగా
కాలువా, రాత్రీ

ఏప్రిల్ వాన
ఈ ఏడాది
రెండు వేసవులు

ఆమె నిద్రిస్తోంది
ఒకే పాన్పుపై
రెండులోకాలలో వున్నాం

పంజరం
ఖాళీగా వుంది
ప్రేమంటే తెలిసిందేమో

నిద్రలో పాపాయి
జోకొడుతున్నాను
నాకోసం

నది పన్నిన వలలో
చిక్కుకొంది
చందమామ

పర్వతం
చుట్టూ తిరిగి
వేయి పర్వతాలు చూసాను

వానలోకి
ఎంతసేపు చూసినా
కళ్ళైనా తడవలేదు

అంత చలి లేదు
ఫాను వేసి
దుప్పటి కప్పుకోనా

వెన్నెల్లో పాపాయి
తన నీడమీద
నడవాలని  చూస్తోంది

అపరిచితుడు
అతని జీవితం
తెలుసుకోవాలని వుంది

చేప దొరికింది
విలవిల్లాడింది
కొలను

దీపం వెలిగింది
వెలుతురా, చీకటా
ఏది ఎక్కువ సున్నితం

పర్వతాలెపుడొచ్చాయి
మా ఊరు!
సంధ్య మబ్బులు!

రైలు పీల్చుకొంది
జనం సందడి!
నేనూ, స్టేషనూ మిగిలాం

వానా, మట్టివాసనా
చిన్నపుడు వచ్చిన
నిద్ర వచ్చింది

చెట్టుకూలింది
మోసుకుపోయారు
నీడ సైతం

తుపాను ఆగింది
ఒక అల
తీరాన్ని నిమిరింది

రాలిన పూలు
పిల్లలు ఏరుకొంటుంటే
నిలబడి చూస్తున్నాను

ఒంటరిగా రోదిస్తూ
అతనెవరో
ఓదార్చాలా.. వద్దా..

సన్నని వాన
చుక్కల జల్లెడలో
పోసారా మబ్బుల్ని

పౌర్ణమి రాత్రి
వీధులు నిర్మానుష్యం
వెన్నెలంతా ఏం చేసుకోను

చిన్నప్పటి జామచెట్టు
పళ్ళు అందుతున్నాయి
అప్పటి రుచిలేవు

దూరంనుంచి
ఓ అమ్మాయి సమీపించి
దూరంలోకి అదృశ్యమైంది

తెరచాప ఊగుతోంది
ఎవరూ లేరు
నది ఒడ్డున

కెరటం
మరొక కెరటం
క్రమంగా చంద్రోదయం

సూర్యబింబం రోజూ
ఏంచూస్తుంది చెట్టుని
ఇటునించి అటు

ఈ రాత్రి మబ్బులది
ఇపుడు చందమామ
ఒక తెల్లని మరక

కిటికీ
ఎవరూ తగిలించని
చిత్రపటం

చిన్నప్పటి స్కూలు
అప్పటి మిత్రులు
ఎక్కడ ఉన్నారో

పర్వత ప్రయాణం
ప్రతి మలుపుకీ
కాస్తంత ఏకాంతం

సూర్యోదయం
ఎండిన చెట్టుకి కూడా
బలమైన నీడలు

వాన మొదలైంది
తడవాలనుంది
అరుగుపై జనం

మేడదిగి చూస్తే
ఇందాక నిలుచున్నచోట
చందమామ

అద్దంలో పాపాయి
ఏ పాప
ముందు నవ్వింది

ఆకాశం
పిట్ట ఎగిరింది
మరొక ఆకాశం

చెట్టుపై కలకలం
పిట్ట ఎగిరిందో
వాలిందో

కీచురాయి!
నిశ్శబ్దం!
మళ్ళీ పాడుతోంది!

వెల్తురూ, నీడలూ
మెట్లపై ఒకేసారి
జారిపడ్డాయి

పూల సౌందర్యం
ఈ పారవశ్యంలోనూ
శ్వాసిస్తున్నాను

చినుకులు గెంతాయి
ఇపుడు
చిరుకప్పలు

బస్సు మలుపు తిరిగింది
చందమామ
ఆలోచననించి విరామం

మిట్ట మధ్యాహ్నం
కాకి అరిచింది
మరొక నిశ్శబ్దం

సీతాకోకా..
ఏం రాయను
నువ్వే ఓ హైకూ

వాళ్ళ బట్టలు
గాలికి ఊగుతున్నాయి
వాళ్ళ హృదయాలు?

నదీ, మబ్బులూ
ఎటునించి ఎటు
కురుస్తోంది వాన!

నిద్ర రావట్లేదు
దీపానికీ, నాకూ
మా చుట్టూ రాత్రి

అమావాస్య రాత్రి
ఇవాళ చందమామ
ఎక్కడ ఉంటుంది

గాలి వీచిందేమో
నీటిబుడగ
తీరానికి జరిగింది

ఖాళీ సమయం
నా చొక్కాపై చూసాను
దీర్ఘశిరోజం

నీటిలో చీమ
చీమంత
జాలి కలిగింది

చీకటి పడింది
భూభ్రమణం తెలుస్తోంది
నిశ్శబ్దంగా నక్షత్రాలు

రైలు ప్రయాణం
చెట్లు తమ మధ్య
దూరాలు కొలుచుకొంటున్నాయి

అద్దం
రెండు పిచుకలు
ఏది బరువు

అతిథి వెళ్ళిపోయినా
గుమ్మంలోనే వున్నాను
ఏకాంత సాయంత్రం

స్నానం చేస్తున్నాను
చలిచీమలు
తుపానులో చిక్కుకొన్నాయి

నాతో చదివింది
ఆ అమ్మాయి
పెద్దవాళ్ళమైపోయాం

సెలయేటిలో
త్రుళ్ళి పడుతోంది
నిశ్శబ్దం

సూర్యాస్తమయం
ఇది ఎన్నోసారి
ఎవర్ని అడగాలి

వీధి దీపం కింద
పాదముద్రలు
రాత్రంతా చెరగలేదు

ఊయలలో పాపాయికి
ఊగుతోంది
రాత్రి

ఎవరో తెలియదు
చిరపరిచయం
ఆమె చిరునవ్వుతో

వాన ఆగింది
కప్పలతో పాటు
మనమూ గెంతాలి

మబ్బు విడినట్లుంది
వెన్నెలలో
నా నీడ పడింది

చీకటి పడుతోంది
దీపం చలిస్తోంది
ఉల్లాసమా, దిగులా

చిన్నప్పటి పాట
అప్పటి నా స్వరం
ఎంత కోమలం

వేగంగా బైటపడ్డాం
మబ్బుల్లోంచి
చందమామా, నేనూ

రేగుపళ్ళు
సగం సగం పంచుకొన్నాం
పురుగులూ, నేనూ

ఆహా! వాన
ఎంత బావుంది
స్కూలు వుండదు

చీకట్లో సైతం
దారి తప్పలేదు
ప్రవాహం

వానజల్లు
కిటికీ మూసాను
ఒంటరితనం

సముద్రంలా నిద్ర
ఒక కెరటం
గుండ్రంగా చుట్టుకొంది

ఏటిమలుపులో
బుడగలు త్వరగా
మునిగి తేలుతున్నాయి

ప్రతిచెట్టుకీ
పగటికలలు;
రకరకాల నీడల చెట్లు

చలిరాత్రి
తల్లీబిడ్డల్ని
చూస్తేనే వెచ్చదనం

సాయంకాలం
చెట్ల నీడల మధ్య
ఏది నా నీడ

నిశ్శబ్దంగా నీరు
నీటిని కోసుకొంటూ
నిశ్శబ్దంగా పడవ

లైటు వెలిగింది
దీపకాంతి
వెలిసిపోయింది

పాపాయి
ఊరు వెళ్ళింది
బొమ్మలు సర్దుతున్నాను

ఏకాంత రాత్రి
ఈ రోజు
ఎవరెవర్ని కలిసాను

అందమైన అమ్మాయి
అంతా ఒకసారి
ఆగి మాట్లాడుతున్నారు

వాన కురుస్తూనే వుంది
ఇంద్రధనస్సు ఎంతకీ
కిందికి రావటంలేదు

ఈ మట్టినేలలో
ఎక్కడున్నాయో
రేపటి పూలు

నిద్రపోయాను
ప్రపంచం
నాకు నిద్రపోయింది

చందమామ
అల్లిన వెన్నెలలో
చిక్కాయి నక్షత్రాలు

చీకట్లో మిణుగురు
మరిచిపోయిన హైకూ
గుర్తు వచ్చింది

అగ్గిపుల్ల వెలిగింది
విలవిలలాడింది
చీకటి

పూలరంగులన్నీ
సాయంసూర్యుని చేరాయి
రాత్రి నల్లనిపూలు

ఇద్దరు పసిపిల్లలు
అక్క తమ్ముడికి
అన్నం తినిపిస్తోంది

అలలేని చోటు
వెదుకుతూ పడవ
నీడ నవ్వుతోంది

మబ్బులు ముసిరాయి
ఎంత ఇరుకుగా వుంది
ఈ ప్రపంచం

వేసవి మధ్యాహ్నం
వృద్ధయాచకురాలు
ఇవాళ రాలేదు

రేపు సెలవు
ఈ రాత్రి ఆకాశాన్ని
ఎవరితో పంచుకోను

కప్ప దుమికింది
నీటిశబ్దం రాలేదు
ఎండుటాకు

పాపాయి నవ్వు
ప్రతిఫలించింది
అందరిముఖాల్లో

వెన్నెలరాత్రి
కిటికీ అద్దంమీద
లతల నీడలు

మార్గం మధ్యలో
చీకటి పడింది
మా ఊరిలో వలెనే

ఎండిన గోదావరిపై
గోదావరంత
ఎండ కాస్తోంది

రాలిన చినుకు
ఆకాశంవేపు
ఎగిరింది బెంగతో

కారుమబ్బులు
అంచులు చెరిగాయి
ఎక్కడో వాన!

అంతా నిద్రపోయారు
ధ్యానసమయం
ప్రకృతికీ, నాకూ

చీకట్లో చెట్టు
దీపం కాంతి
కొన్ని ఆకులపై పడింది

రాలిన పూవు
కదిలితే హైకూ
కదలకుంటే హైకూ

నే వస్తూన్న రైలు
ఈ ఊళ్ళు దాటినట్టే
మా ఊరు దాటుతుంది

పాడుతున్నాడు
అతను ఇప్పుడు
మరో మనిషి

పిల్లలు వెళిపోయాక
ఒంటరిగా మిగిలింది
తోటలో ఆకుల శబ్దం

పొద్దుటి పొగమంచు
మేఘాలలోకి
మా ఊరు ఎప్పుడెగిరింది

వెనుతిరిగి చూసాను
ఎంతబావుంది
నడచివచ్చిన దారి

వంతెన వేసారు
కాలువ ఒక గట్టున
ఊగుతూ బల్లకట్టు

కోటశిధిలాలలో
గడ్డి మొలిచింది
అంతా నిశ్శబ్దం

అందమైన పూవు
రాలిపోకముందే
వెళ్ళిపోవాలి

అంతా నిశ్శబ్దం
బావిలోకి చూసాను
లోతైన నిశ్శబ్దం

చిన్నపుడు దాచిన
నెమలికన్ను
ఇంకా పిల్లల్ని పెట్టలేదు

# పూలురాలాయి

## హైకూలు

బి.వి.వి. ప్రసాద్

రచనాకాలం: 1997–99
ప్రథమముద్రణ: అక్టోబర్ 1999

అంకితం

కవిత్వంలోకీ
నిశ్శబ్దంలోకీ
మేలుకొల్పే స్ఫాప్నికుడు

శ్రీ ఇస్మాయిల్ కవికి

ప్రేమతో..

చీకటి పడ్డాక
చెట్లు మళ్ళీ పూచాయి
మిణుగురులు

చెట్టుకొమ్మల్లో
ఒక మిణుగురు
దారితప్పి తిరుగుతోంది

మిణుగురులూ
ఎగరండి..
నక్షత్రాల వరకూ..

ఒక తీరిక రోజు
పూలు పూచాయి
.. రాలాయి

కోసిన పూలకన్నా
అందమైనవి చూడు
ఈ రాలిన పూలు

దారి నిండా
పూలు రాలాయి
నడవటం ఎలా?

పూలపని హాయి
ఒక రాత్రీ
ఒక పగలూ

పూవులతో
సీతాకోక
ఏదో చెప్పి వెళ్ళింది

వాన వెలిసింది
రాలినపూలు తేలుతున్నాయి
చెట్ల ప్రతిబింబాలమీద

వాన వెలిసింది
ఒక్కటే తడవలేదు
చెట్టు నీడ

ఇందాక ఆట మరిచారు
పిల్లలిప్పుడు
వాననీళ్ల ఆటల్లో

ఓ చినుకుబొమ్మ గీచి
ఎవరో
మబ్బుల్ని పట్టుకుపోయారు

వానలు తగ్గాయి
ఇంట్లోనే ఉండిపోయింది
ఓ కాగితం పడవ

దాచుకోగలిగితే
ఈ వెన్నెల
ఇంత కోమలంగా ఉంటుందా!

బాల్చీలోని శూన్యం
నూతిలో
ఎలా కరిగిపోయింది!

దేనిమీద ఈ ఇష్టం
నక్షత్రాలా
వాటి దూరమా

చిన్ననాటి ఆకాశం
ఈనాటికీ
కిందికి రాలేదు

శిశిరవాయువు
వృద్ధుని కుర్చీ
ఖాళీగా వుంది

చెట్టు మారలేదు
వాసంత పత్రాలు
శిశిరంలో రాలుతున్నాయి

శిశిర సంధ్య
చిన్నప్పటి ఇల్లు
ఎవరో ఉంటున్నారు

శిశిర రుతువు
తరచూ గుర్తొస్తున్నాయి
బాల్యం, వృద్ధాప్యం

సాయంత్రం
చెట్టులోంచి కూత
వినిపించలేదు మరోసారి

ప్రవాహం
తీసుకుపోయింది
పూలనీ, ప్రతిబింబాలనీ

చందమామ
సమీపించింది
కొండమీది ఆలయాన్ని

కొండమీది ఆలయం
ఊరితోపాటు
వానలో తడుస్తోంది

నక్షత్రాకాశం
మెట్లదారి
కొండమీది గుడివరకూ

గాలికి కదులుతోంది
కొండల్ని గీచిన
చిత్రపటం

తడిమట్టిమీద
రాలినపూలు
మరొకసారి వికసించాయి

నక్షత్రాలు చెప్పలేదు
ఎంత రాత్రి గడిచిందో
నేనూ అడగలేదు

కొంతసేపటి క్రితం
ఈ దారిలో
సీతాకోక ఎగిరింది!

పూలు రాలుతున్నాయి
గాలికి అంటుకోలేదు
వాటి రంగులు

రా సీతాకోకా..
నా గదిలో ఒకసారి
ఎగిరి వెళ్ళు

ఓహ్ మిణుగురు!
అటు చూడు
మరొకటి!

చిన్ని పూవా
ఇంకా సరిగా చూడలేదు
రేపు మరలా పూస్తావా

ఈ ఇంద్రధనువు
కొత్తదేనా!
నా చిన్నప్పటిదా!

నిద్ర పట్టడంలేదు
పూలు రాలుతున్నాయి
ఒక్కొక్కటీ..

నది మధ్యలో
పడవ ఆగింది
నక్షత్రాలు ఊగుతున్నాయి

పూలని చూస్తున్నాను
ఓ సీతాకోక నామీద వాలి
ఎగిరిపోయింది

పూలు లేకపోతేనేం
రెండు సీతాకోకలు
తోటంతా తిరుగుతున్నాయి

మంచునెవరో
మసిచేతులతో తాకారు
చెట్లూ, కొండలూ

పొగమంచు
చీపురుపొదలు
పర్వతం కనిపించలేదు

అల్లుకొన్న లతలు
గాలికి ఊగుతున్నాయి
కానీ.. పాత రైలుపట్టాలు..

నిలవనీటిలో
ఏ మరకా అంటుకోలేదు
పూల ప్రతిబింబాలకి

చందమామ
పాట పాడాలని వుంది
పాడాలని లేదు

చందమామని
ఎవరో చిత్రించారు
రైలు కిటికీలో

గదిలో వున్నా
తడుస్తున్నాను
వానచప్పుడులో

సాలెగూటిలో
చిక్కుకుపోయాయి
ఒకటిరెండు నక్షత్రాలు

వెళ్ళిపోయిన సీతాకోక
తిరిగివస్తోంది
ఏదో రంగుల జ్ఞాపకంతో

చెట్లనీడలో చేరాక
సీతాకోక నీడ
ఎటుపోయింది!

ఊరిలో ఉత్సవం
పాపాయి మాత్రం
వెన్నెల్లో నిద్రపోతోంది

ఇందాక చూసిన
అందమైన దృశ్యంలోకి
ఇప్పుడు నేనూ చేరాను

పాపాయి చెప్పింది
చందమామ
ఊళ్ళోకి వచ్చిందని

సంధ్యమబ్బులు
వీటిలో పుట్టివుంటాయి
సీతాకోకలు!

దు:ఖసమయం
గొంగళిపురుగు
గూడు కట్టుకొంటోంది

స్నేహితులారా
ఏమి మాట్లాడాలి
మీతో, పూవులతో..

దు:ఖపురాత్రి
నువ్వైనా తోడువుంటావా
గొంగళిపురుగూ

జ్వరసమయం
ఇప్పుడు నా గది
వెన్నెలలో వుంది

కనులు మూస్తే
కనుపించింది
ఓ నల్లని సీతాకోక!

పనుల మధ్య
కాస్తంత విరామం
నక్షత్రాలు చూసేందుకు

ప్రతిబింబం
చెరువులో మునిగాక
చందమామ శుభ్రపడింది

పద సీతాకోకా
ఈ నగరంలో
మనకు చోటులేదు

పూవు వికసిస్తోంది
ఇంకా సున్నితమైన
శూన్యంలోకి

తెల్లవారింది
ఏదీ వెళ్ళలేదు
వెన్నెలతో..

సీతాకోకా
నువు చనిపోలేదు
ఎగిరిపోయావు..

అడవిచేరాక
కావాలని
దారితప్పాను

కలలో
ఒకరితో అన్నాను
ఇది కలలా వుంది!

మేలుకొన్నాను
ఇవాళ కూడా
మానవశరీరంలోనే..

నక్షత్రాల క్రింద
ఎవరో అంటున్నారు
నువ్వెప్పుడొచ్చావు

రామచిలుక
ఎగిరి ఎగిరీ
తనలోతాను వాలింది

చీకటీ, నిశ్శబ్దం
ఎక్కడవున్నాను!
నేను ఎవరిని!!

కొత్త ప్రదేశం
వెళ్ళానా!
కలగంటున్నానా!

కలలోంచి వచ్చేసాను
అక్కడివారు
దు:ఖిస్తున్నారా..

కల ముగిసింది
గాఢాంధకారం
మేలుకొన్నానా, లేదా!

చిన్నారి కప్ప
నన్ను బెదిరిస్తోంది
కాలికింద పడతానని

ఇక నిద్రపోవాలి
నక్షత్రాలు ఈ రాత్రి
భూమి చేరలేదు

మైదానంలో
ఎగురుతున్నాయి
సీతాకోకలూ, నిశ్శబ్దాలూ

పూలవనం
ఏ మొక్కా పూయలేదు
నిన్నటి పూలు

కానుకపోయింది
అతిథిపైన
ప్రేమమాత్రం మిగిలింది

దొంగకి ధన్యవాదాలు
సామానుతో పాటు
నా భయాన్నీ తీసుకుపోయాడు

నక్షత్రాలని
పంచుకొన్నాం
ఆకాశం, నేనూ, చెరువూ

నక్షత్రాల లెక్క
మళ్ళీ మొదలుపెట్టాను
పూర్తయితే ఎలా

వసంతం
చిత్రపటంలోని
కోయిలకూడా కూస్తోంది

దీపం ఆరింది
రాత్రి ఆగలేదు
ఒక్క క్షణమూ..

పాపాయి
దీక్షగా చెరుపుతోంది
గోడమీది నీరెండని

ఒకే కాంతిలో
మనతో పాటు
ఎగిరే సీతాకోకలు

వానలు పడ్డాయి
కీటకాలూ, లతలూ
ఇక ఏకాకినికాను

మంచులోంచి
ఏదో సంభాషణ
నడిచివస్తోంది

వాననేలలోంచి
పచ్చని గడ్డిమొనా
కీచురాయి చప్పుడూ

ఒక కీచురాయి చాలు
ఈ చీకటిని
నింపటానికి

మిణుగురు గుంపు
ఎటువైపు ఎగరాలో
ఇంకా తేల్చుకోలేదు

రాత్రి మృదువుగా లేదు
ప్రతి నిమిషం
కీచురాళ్ళ శబ్దం

ఈ కీచురాయి చప్పుడు
చందమామని కూడా
చేరుతోందా!

ఆలోచనలో చూడలేదు
ఇందాక ఎక్కడో
ఆ పసుపు పూలు

పాటచివర్లు పట్టుకొని
పాపాయి
నిద్రలోకి జారుతోంది

సంభాషణలో విరామం
ఎప్పటినుండో
ఓ కీచురాయి అరుస్తోంది

నేనూ, చంద్రుడూ, రాత్రీ
మా ఒంటరితనమే
మా పరిపూర్ణత

ఊరుచేరాను
వెనుకపడ్డాయి
పొలాలూ, వెన్నెలా

తెల్లవారుతోంది
కరుగుతున్నాయి
మంచూ, చందమామా

విప్పారే కలువపై
ఒకవైపు ఎండా
ఒకవైపు నీడా

పూలురాలాయి
కొమ్మలన్నిటినీ
మంచు కప్పివుంచింది

చీకటిలో
దారి తప్పలేదు
ఈ రాత్రికూడా

ఏది మంచు
ఏది నది
ఏది ఆకాశం!

పల్లెలో రాత్రి
పాట ఆగింది
నక్షత్రాలు మెరుస్తున్నాయి

నిద్రించే ముందు
చూడాలనిపించింది
నక్షత్రాకాశం

నదీ ప్రయాణం
గట్టుమీది మనుషులు
హాయిగా నడుస్తున్నారు

మా మాటల మీదుగా
వెళ్ళిపోయింది
ఏదో పూల పరిమళం

పూల పరిమళం
తనతో తీసుకువచ్చింది
ఆ పూలరంగులని

ప్రొద్దుటిమంచు
ప్రతి సాలెగూటికీ
ఓ ఇంద్రధనువు చిక్కింది

మధ్యాహ్నపు కునుకు
చిన్న కల..
చిన్న మెలకువ..

జ్వరం వచ్చింది
చూపులు సంచరిస్తున్నాయి
జడివానలో..

నక్షత్రాలు కరిగాక
ఆకుల చివర్లలో
మంచుబిందువులు

రాలిపోతున్నాయి
రాలిపోతున్నాయి
మంచుబొట్లు.. క్షణాలు..

చెట్లనుండి రాలిన
పూలని విడిచి
మంచు కరిగిపోయింది

వెన్నెల వస్తోంది
తెల్లని మంచులో
చివరికొంగ ఎగురుతోంది

చప్పుడులేకుండా
చెరువులో ప్రవేశించింది
చంద్రుని ప్రతిబింబం

గడ్డిపరకలమీద
మెరుస్తున్న మంచులో
ఎవరో నడిచినగుర్తులు

మిణుగురు వెళిపోయింది
మళ్ళీ ముసిరాయి
పాత జ్ఞాపకాలు

కనులుమూసి వింటున్నాను
వెన్నెలలో
వెన్నెలమీది పాట!

పనుల మధ్య
పూల పరిమళం
విశ్రాంతి అవసరంలేదు

కీచురాయికి
ధన్యవాదాలు
మమ్మల్ని మౌనంగావుంచింది

తీరికలేని పనులు
ఆకాశాన్ని చూసి కూడా
చాలా రోజులైంది

ఈ రోజంతా
పూలని చూసే పని
నాకూ, సీతాకోకలకీ

వెన్నెల రాత్రి
మిత్రునికి పంపాలనిపించింది
ఒక తెల్లని కాగితం

శిశిరసాయంత్రం
ఎవరైనా వస్తున్నారా
నాతో మౌనంగా గడిపేందుకు

పూలూ, సీతాకోకలూ
కలిగిస్తున్నాయి
రంగురంగుల సంతోషాలు

సీతాకోకల గుంపు
ఎగిరిపోయింది
ఒక్కటీ లేకుండా

సీతాకోకని
చిత్రించటంకూడా తేలిక
ఓ రెక్క ఊహిస్తే చాలు

మైదానంలో సీతాకోకలు
ఎగురుతున్నాయి
వాటి నీడలమీద!

మిణుగురు వెనుకే
తీరికలేకుండా
ఎగురుతోంది చీకటి!

నక్షత్రాల క్రింద
ఇది ఏ ఊరు!
ఇవాళ తేదీ ఎంత!

తెల్లవారుతోంది
కరిగిపోతున్నాయి
కలలూ, నిద్రలూ

ఈ రోజు కూడా
వేరు చేయలేకపోయాను
పగలు నుండి రాత్రిని

కదలని నీటిలో
గురి తప్పకుండా
కప్ప తనలోకి దుమికింది!

వరిమడిలో నీళ్ళు
నాట్లు వేస్తున్నారు
ఆకాశాన్ని చూసే పనిలేదు

వెదురుపొద
ఏ ధ్వనీ చేయటంలేదు
దాని ప్రతిబింబమైనా

వాన వెలిసింది
రాలిన పూలమీద
చెట్టు చినుకులు రాల్చుతోంది

కోనేరు
పూల ప్రతిబింబాలపై
సీతాకోక ఎగురుతోంది

అటూ ఇటూ నడిచి
ఏమీ తోచక
పాప నిద్రలోకి నడిచింది

నక్షత్రాల గురించి
మాట్లాడుకొన్నాక
మౌనంగా ఉండిపోయాం

ఎంత ఏకాంతం!
జ్వరం మాత్రమే
పలకరించి వెళుతోంది

జ్వరం వచ్చింది
చిన్నప్పటి జ్వరాలు
జ్ఞాపకం వస్తున్నాయి

నాకు జ్వరం వస్తే
పూవులేం పాపం చేసాయి
కోసి తెచ్చారు

ఏం జ్వరానుభవం
శరీరం కంపిస్తోంది
వానలో తటాకంలా

ఎవరూ తెలీని ఊరు
ఎంత హాయిగావుంది
ఆలయం అరుగుపై నిద్ర

తెల్లవారుతోంది
ఆలయం కోనేటిలో
పూలు రాలుతున్నాయి

ఎలా నిద్రపోవాలి
పగలంతా పని
రాత్రంతా వెన్నెల

దుప్పటి దులిపినా పోలేదు
వెన్నెల మీద
ఎలా పడుకోవాలి

పూలు కోయలేను
ప్రతిబింబాలనైనా
ఏరుకోగలనా!

ఒంటరిగా ఎగురుతోంది
నా కలలోని సీతాకోకని
తోడు పంపనా

మబ్బుల కాంతిలో
పూలమొక్కల చుట్టూ
చల్లదనం తిరుగుతోంది

వాన మొదలైంది
చెట్టు కొన్ని ఆకులు రాల్చి
వానలోకి మాయమైంది

వానంతా కురిసాక కానీ
ఏమీ మాట్లాడలేదు
నేనూ, పిల్లకాలువలూ

పూలకుండీలు అమర్చారు
మొక్కలకీ తప్పలేదు
క్రమశిక్షణ

పూలరంగులు
తెలియటం లేదు
కానీ వాటిమీది వెన్నెల!

పూలరుతువు వెళ్ళిపోయింది
మొక్కలూ, నేనూ
ఏం మాట్లాడుకోం..

కలలో
కనిపించిన మిత్రుడు
నన్నూ కలగని వుంటాడా!

కీచురాయి వెళ్ళిపోయినా
దాని పాట ఇంకా
నన్ను విడిచిపెట్టలేదు

ఇప్పటి చినుకులే
ఎప్పుడు నేర్చుకొన్నాయి
క్రమంగా చూరు విడవటం!

మల్లెపందిరి కింద
నిశ్శబ్దంగా రాలుతున్నాయి
పూలూ, వెన్నెలలూ..

అందరూ వెళ్ళిపోయాక
ఆలయ ప్రతిబింబం
ధ్యానం చేసుకొంటోంది

అందరూ మాయమయ్యారు
పొగమంచులోకి
నేను మాత్రం మిగిలాను

ఏకాంతసమయం
రైలుకూత దూరమయాక
చలి మళ్ళీ ముసిరింది

చీకటిలో రైలు
వేగంగా వెళిపోతోంది
మిణుగురు గుంపుల్లోంచి

రైలు వెళిపోయింది
పట్టాలపై తీరికగా
ఎగురుతోంది సీతాకోక

రైలు వెళిపోతోంది
తోటలమీది చీకటి
గాలికి ఊగుతోంది

ఎవరూలేని స్టేషన్‌లో
రైలు ఆగింది
నేనే ఒకసారి దిగనా..

చిన్నారి పాపలు
ఇలాగే ఆడుకొని వుంటారు
బాల్యంలో వారి తల్లులు

క్లాసురూం కిటికీలోంచి
ఒక పిల్లవాడు
ఆకాశాన్ని చూస్తున్నాడు

కొన్ని హైకూలు రాసాక
దిగులు క్రమ్మింది
దూరంగా పూలురాల్చిన చెట్టు

ఈ అక్షరాలు చూస్తారు
కానీ ఈ కాగితం చుట్టూవున్న
నిశ్శబ్దాన్నీ, రాత్రినీ..

చిన్నారి పూవులారా
నిద్రవస్తోంది
కలలోకి వస్తారా..

కలలో ఎవరో అన్నారు
మేలుకో.. మేలుకో..
కానీ ఎలాగో చెప్పలేదు

వర్షరుతువు
కాలువ ప్రవహిస్తోంది
మబ్బులతో నిండిపోయి

శిశిరరుతువు
చెట్లు ఆకులు రాల్చి
ఆకాశాన్ని ధరిస్తున్నాయి

అడవిపూలు
ఎవరూ చూడలేదేమో
ఎంత స్వచ్ఛంగా వున్నాయి!

దీపం ఆరింది
గదిలోని  కాంతి
మరలా దీపంలో లీనమైంది

ఎంత చీకటి!
దూరంగా వున్న దీపం
ఎటు పోతోంది!

రంగులపూలన్నీ
చీకటిలో కలిసాయి
ఒంటరిగా ఓ తెల్లనిపూవు

ఏది ముందు నిర్మించారు
ధ్యానమందిరాన్నా
లోపలి నిశ్శబ్దాన్నా

ఎంత ప్రశాంతత
పూలులేని చెట్లుకూడా
అందంగా కనిపిస్తున్నాయి

సీతాకోక వెళ్ళాక
ఎందుకనో
పూలు ఊగినట్లున్నాయి

వానలో
పూలు తడుస్తున్నాయి
ఎంత అందమైన వాన

బాల్చీలో పైకి వచ్చింది
చిన్ని ఆకాశం
బావిలో మరొకటి!

ఏది సున్నితం
కలా.. మెలకువా..
కలనుండి మెలకువా..

కిటికీ తెరిచాను
పొగమంచు కొద్దిగా
లోనికి ప్రవేశించింది

పూలుతాకినా చెదురుతోంది
ఎంత సున్నితం
కొలనులోని ఆకాశం

గాలి వీచినట్లుంది
ఆకులన్నీ ఒకసారి
నీడల్ని మార్చుకొన్నాయి

వానలో స్కూలు
పాఠాలు మరిచారు
మాష్టారు సైతం

శిశిర సాయంత్రం
ఎవరో సమీపించి
నా ఏకాంతాన్ని తీసుకువెళ్ళారు

గాలి వీచింది
ఒకచోట చేరాయి
రాలినపూలు

వాలినకొమ్మ
భద్రంగా దాచుకొంది
తన నీడలు

దీపకాంతి
ఒక్కొక్క పూవుకీ
రంగులు దిద్దుతోంది

ఎటుపోయింది మెరుపు
ఈ కారు చీకటిలో..
నక్షత్రాలను చేరిందా

ఎంత తెల్లనిమంచు
ఎంత చల్లదనం
చందమామలో వున్నానా!

దూరంగా ఎవరో
సంధ్యాసూర్యునిలోకి
నేనూ వారితో వెళ్ళాల్సింది

నా నక్షత్రాలనుంచి
ఉల్క రాలింది
నా భూమిమీద

రుతువులు మారుతున్నాయి
ఎలా ఉందో చూడాలి
చివరిరుతువు

ఇంకా ఏంకావాలి
ఇలాగే పూలు పూస్తాయి
నేను వెళ్ళిపోయాక

సీతాకోకలు.. పూలు..
వాటిమీద కొలను
ఎంత చిన్ని ప్రపంచం!

కొలను కదిలింది
తామరాకూ జారనీయకు
నీటిముత్యాలు

పురాతన ఆలయం
పూల వికాసం
ఒకే ప్రశాంతతలో..

# చంద్రుణ్ణి చూపించే వేలు

ఇస్మాయిల్

హైకూ అంటే చంద్రుణ్ణి చూపించే వేలు; ఏరు దాటాక దిగవిడిచే తెప్ప. చంద్రుణ్ణి చూపించాక వేలు అవసరం లేదు. ఏరు దాటాక తెప్ప అవసరం లేదు. తనని తాను రద్దు చేసుకుని, తను అదృశ్యమైపోయి, స్వతస్సిద్ధ వస్తు తత్వాన్ని (thing in itself) ఆవిష్కరించటం హైకూ అనే కవితా ప్రక్రియ ప్రత్యేక లక్షణం. ఇదే దీన్ని మిగతా ప్రక్రియల్నించి వేరుచేస్తుంది.

ప్రాకృతిక వస్తువులతో మన మౌలికమైన ఐక్యాన్ని సిద్ధింపచేసుకొనే ఈ అనుభవాన్నే 'జెన్', లేదా 'హైకూ అనుభవం' అంటారు. వస్తువు మనలో తన్ను తాను చూసుకుంటుంది; మనం వస్తువులో మన నీడని చూసుకుంటాం. విషయికీ (subject) విషయానికీ (object) మధ్య సరిహద్దు చెరిగిపోతుంది. కవి ప్రకృతితో తాదాత్మ్యాన్ని సిద్ధించుకుంటాడు. విశ్వంతో తాదాత్మ్యాన్ని సాధించినపుడే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

నిజమైన కవిత్వానుభవంలో ఆత్మ, పర భేదాలు లయిస్తాయి. అనుభవించే మనస్సూ, అనుభవింపబడే వస్తువూ వేరువేరు కాదు, రెండూ కలిపి ఒకటే అనుభవం. ఇది అంతర్ జ్ఞాన సంబంధమైంది (intuitive), హేతుబుద్ధికి (reason) సంబంధించింది కాదు. అనుభూతి పరమైంది. తార్కికమైన ఆలోచనలతో దీనికి సంబంధం లేదు. ప్రతి వస్తువుకీ దాని సారభూతమైన అస్తిత్వం ఉంటుంది. మన అస్తిత్వాన్ని దానితో ఐక్యం చేసినప్పుడే దాన్ని తెలుసుకోగలం. ఇది బుద్ధితో కాని, తర్కంతో కాని కలుషితం కాని ప్రత్యక్ష అనుభవం ద్వారానే సాధ్యం. మనస్సూ, వస్తువూ ఐక్యం సాధించగలిగే ఈ అనుభవాన్ని జపానీయ బౌద్ధులు 'జెన్' అన్నారు. 'జెన్' అనగా ధ్యానం. ఈ అనుభవం ఆత్మాశ్రయమూ (subjective) కాదు, వస్త్వాశ్రయమూ (objective) కాదు. ఏకకాలమందు రెండూనూ. నిజానికి కవిత్వానుభవమంటే ఆవశ్యకంగా ఇదే. విషయీ, విషయ భేదాలు

చెరిగిపోయినప్పుడే కవిత్వం ఉద్భవిస్తుంది. కాసిరెర్ (Cassirer), డ్యూయీ (Dewey), పౌండ్ (Pound), ఇలియట్ (Eliot), లాంజర్ (Langer) వంటి ఇటీవలి పాశ్చాత్య సౌందర్యవాద తాత్త్వికులు (aesthetic philosophers) ఈ పర్యవసానానికే వచ్చారు.

ఐతే, ఈ కవిత్వానుభవం వివరణ ద్వారా కాని, ఆలోచన ద్వారా కాని, అలంకారాల ద్వారా కాని, ప్రవచనాల ద్వారా కాని అభివ్యక్తీకరించబడదు. దీనికి పదచిత్రం (image) ఒక్కటే సాధనం. ఆ ప్రత్యేక కవిత్వానుభూతితో స్పందించే పదచిత్రమొక్కటే ఈ హైకూ అనుభవాన్ని పట్టివ్వగలదు.

పదచిత్రమనేది ఇంద్రియకం (sensuous). ఇంద్రియజ్ఞానాన్ని ప్రేరేపిస్తుంది. హేతుబుద్ధికి సంబంధించింది కాదు. లోతైన అనుభూతుల్నీ (feelings), భావాల్నీ (emotions) ఆవాహించే శక్తి పదచిత్రానికుంది. కవిత్వానుభవాన్ని పదచిత్రాలు స్ఫురింపచేసినట్లు బౌద్ధికమైన ఆలోచనలు స్ఫురింపచెయ్యలేవు. కనక, హైకూ ప్రాణం పదచిత్రంలో ప్రతిష్ఠితమై ఉ ంటుంది. మూర్తమూ (concrete), ఇంద్రియగ్రాహ్యమూ ఐన పదచిత్రం ఏ విధమైన వివరణ సహాయం లేకండా హైకూలో భాసిస్తుంది.

ఉదాహరణకి, హైకూ కవితా పితామహుడు, 17వ శతాబ్దంలో జీవించిన జపానీయ కవి 'బషో' ప్రసిద్ధ హైకూ:

ఎండిపోయిన కొమ్మమీద
కాకి ఒంటరిగా కూచుంది.
చలికాలపు సాయంత్రం.

ఈ పదచిత్రంలో ఇచ్చిన మూడు వస్తువులూ – ఎండిపోయిన కొమ్మా, ఏకాకి కాకీ, చలికాలపు సాయంకాలమూ – ఒకే రకమైన అనుభూతిని ప్రసరిస్తున్నాయి. ఈ మూడింటినించీ సమానంగా ఉబికే అనుభూతి గాఢతకు మనం చలించకండా ఉండలేము. ఈ మూడు మూర్తమైన వస్తువుల ద్వారానే ఆ హైకూలోని చలికాలం సాయంత్రపు ఒంటరితనపు దిగులుని అనుభూతించగలుగుతున్నాం. ఇది వేరే విధంగా,

అంటే వట్టి బౌద్ధిక ప్రక్రియల ద్వారా సాధ్యం కాదు. ఇది ప్రత్యక్ష ఐంద్రియక అనుభూతి. ఇది ఆత్మాశ్రయంకాదు. మనస్సూ, వస్తువూ, రెంటి కలయికవల్ల ఉద్భూతమైంది. విశ్వ హృదయంలో ప్రవేశించి, దానిలో ఐక్యమవటమంటే ఇదే.

హైకూలో మనకు కనిపించేవి ప్రత్యేక, ప్రాకృతిక దృశ్యాలైనా, వాటిద్వారా మనం సార్వత్రిక భావాల్ని అందుకోగలుగుతున్నాం. ప్రతి విశేష (particular) వస్తువు వెనకా సార్వత్రిక (universal) సత్యం దాగివుంటుంది. విశేష, సార్వత్రికాల సమ్మేళనమే హైకూ. విశేష అనుభవాల నించి సార్వత్రిక సత్యాలకు చేరవేస్తుంది.

ఆత్మ, ప్రకృతుల కలయిక వల్ల సాధించే ఇటువంటి దర్శనాన్ని అభివ్యక్తం చెయ్యటానికి హైకూయే సరైన రూపమని అభిజ్ఞుల అభిప్రాయం. హైకూ అనుభవం వంటి ఆత్మిక ఆవిష్కృతి కొన్నిక్షణాల కన్నా ఎక్కువసేపు నిలవదు. దాని అభివ్యక్తికి మూడు పాదాల హైకూ సరిపోతుంది.

17 వర్ణాల నియమం తెలుగులో పాటించటం అసాధ్యం. జపానీయ భాషలో ఏకవర్ణ పదాలెక్కువ. తెలుగులో బహువర్ణ పదాలు జాస్తి కనక, జపానీయ భాషను అనుకరించటం తెలివితక్కువ.

బషో చెప్పినట్లు 'వెదురుచెట్టు గురించి తెలుసుకోవాలంటే, నీ మనస్సునీ, ఆలోచనల్నీ త్యజించి, వెదురులోకి ప్రవేశించు'. ఇది హైకూ మార్గం.

నిజంగా హైకూ అనేది పద్యం కాదు; సాహిత్యప్రక్రియే కాదు. అది సైగ చేస్తున్న చెయ్యి; సగం తెరిచిన ద్వారం; శుభ్రంగా తెరిచిపెట్టిన అద్దం. ప్రకృతికి తిరిగివెళ్ళేమార్గం. మన సహజ తత్త్వానికి తిరిగివెళ్లే మార్గం. మన పుష్పతత్త్వానికీ, పర్ణతత్త్వానికీ, జలతత్త్వానికీ, ఆకాశతత్త్వానికీ, ఒక్కమాటలో చెప్పాలంటే, మన బుద్ధతత్త్వానికి తిరిగివెళ్లే మార్గం.

## II

'జెన్' అనే పదాన్ని రెండర్థాలలో ఉపయోగిస్తుంటారు: 1. ప్రాకృతిక వస్తువులతో ఐక్యమౌతూనే మన వ్యక్తిత్వాన్ని నిలుపుకునే మనఃస్థితి. 2. బౌద్ధ తాత్వికుడైన బోధిధర్ముడు (క్రీ.శ. 470-534) మహాయాన సిద్ధాంతాలను నిత్యజీవితానికి అన్వయించిన పద్ధతి.

నిజానికి జెన్ అనేది ఒక జీవితపద్ధతి. మన నిత్యజీవితంలో ప్రతి ఆచరణలో ప్రతిక్షణమూ అనుసరించదగ్గది. ఈ తాత్త్వికవైఖరి జపాన్‌జాతి జీవనంలోనే గొప్పమార్పు తీసుకువచ్చింది. ఒక మహత్తరమైన సంస్కృతిని సృష్టించింది. సామాన్యజనం మనస్తత్వాన్ని కూడా సున్నితపరిచింది. ఒక జాతి జాతినీ సౌందర్యారాధకులుగా మలిచింది.

దీన్నిబట్టి ఒక విషయం సులువుగా బోధపడుతుంది. ఎవరుపడితే వారు హైకూ రాయలేరు. దానికి ఒక విధమైన మానసిక వైఖరి కావాలి. ప్రకృతి యెడల అపారమైన ప్రేమా, అంతర్ముఖత్వమూ, రెండూ ఏకకాలమందు అవసరం. ప్రాపంచిక లంపటాలయందు విముఖత్వమూ, ప్రశాంతమైన మనఃస్థితీ, సుకుమారమైన అనుభూతీ, ప్రపంచం నశ్వరమనే అవగాహనా, దానినుంచి ఉబికిన జాలీ – ఇటువంటి మానసిక లక్షణాలున్నవారు కాని హైకూ రాయలేరు.

కనక, మిత్రులు ప్రసాద్‌గారు 'నేను హైకూలు రాశాను, చూస్తారా?' అని అడిగినప్పుడు నాకేమీ విస్మయం కలగలేదు. స్వభావరీత్యా హైకూ రాయగలిగిన చాలా కొద్దిమంది కవుల్లో ఈయనొకరు.

వర్షం
క్షణం పూచే నీటిపూలతో
ఊరు నిండిపోయింది.

అనటంలో చేతనా సౌకుమార్యమూ, సౌందర్యం క్షణికమనే అవగాహనా, దీన్నించి పుట్టిన ఒక విషాదమూ స్ఫురిస్తాయి. సుకుమారమైన అనుభూతిని జెన్ రసజ్ఞులు 'మియాబి' అంటారు. సౌందర్యపు క్షణికత్వాన్ని తెలుసుకున్నప్పుడు కలిగే దిగులుని 'అవారే' అంటారు.

గోడలో పూచిన పూవు
పరిచయం చేసింది
మా గోడను.

ఇంతకాలం ఉపేక్షించిన గోడని ఆకస్మికమైన, క్షణికమైన పూవు పరిచయం చేసింది, హైకూలాగే! కవిత్వానుభూతీ, పదచిత్రాల సమన్వయం ఇక్కడ మీరు గమనిస్తారు. ద్రష్టా, దృశ్యమూ, అనుభూతీ ఏకత సాధించాయి.

పూవూ లేదు
నేనూ లేను
సౌందర్యం ఆవరించింది.

ఇదే 'జెన్ సమాధి'!

ఎప్పుడూ విస్మయంతో
పూలని నేనూ
నన్ను పూలూ,

ద్రష్టకీ, దృశ్యానికీ తేడా యేమిటి?

ఈ హైకూ పుస్తకం వానతో మొదలై, చివర్న వానతో ముగుస్తుంది. నాకుమల్లేనే ప్రసాద్‌గారికి వానంటే ఇష్టమనుకుంటాను.

వాన వెలిసింది
తీగపై
చిన్ని ప్రపంచాలు వేలాడుతున్నాయి

ఒక జెన్ కోఅన్ (ప్రహేళిక) ఉంది: శిష్యుడు గురువుగారిని ప్రశ్నించాడు: 'స్వామీ, తమరింత స్పష్టంగా ఎలా చూడగలుగుతున్నారు?'. సమాధానం: 'కళ్ళు మూసుకున్నాను కనక'.

బైట కళ్ళు మూసుకుని, లోని కళ్ళు తెరిస్తే కాని హైకూ రాయలేరు.

(దృశ్యాదృశ్యం ముందుమాట: ఫిబ్రవరి 1995)

# లహరి

డా. సంజీవదేవ్

ఇంద్రధనువు రూపొందుతుంది వస్తు జగత్తులో. అది ఇంద్రియ గ్రహణ ద్వారా ప్రతిరూపొందుతుంది మానస జగత్తులో. ఇది శబ్దమాధ్యమం ద్వారా కవితగా అవతరిస్తుంది తిరిగి వస్తు జగత్తులో. కవితను రచించిన వ్యక్తి కవి అవుతాడు. కవి అయినంత మాత్రాన తాను ఏది రచించినా కవి కాడు. కవితను రచిస్తే మాత్రమే అవుతాడు కవి. ఇంతకు ముందు వస్తువుగా వున్న ఇంద్రధనువు ఇపుడు కవితగా వున్న ఇంద్రధనువు అయింది.

ఈ కవితల కర్త బివివి ప్రసాద్ కవి, కవితా రచన చేస్తాడు కనుక. ఆధునిక వచనకవితను రచిస్తాడు కనుక, ఆయన ఆధునిక వచనకవి. ఈ సంపుటిలోని కవితలన్నీ లఘురూపంలో వున్న 'త్రిపద'లు. ఇటువంటి 'హైకూ' అనబడే కవితలకు పుట్టిల్లు జపాన్. వీటి రచనకు ప్రేరణ ప్రధానంగా దృశ్య జగత్తు. ప్రకృతి వీటి రచనకు మౌలిక ప్రేరణ.

తొలకరి మబ్బుల తునకలు ఉరుము లురుముతూ, మెరుపులు మెరుస్తూ తేలిపోతుంటే కవి చేతిలో ఒక కమనీయ కవిత రూపొందుతుంది. ఆకురాలు కాలంలో పండుటాకులు, ఎండుటాకులు భూమిమీద రాలుతుంటే ఆ దృశ్యాన్ని ఒక దృశ్య చిత్రంగా రూపొందిస్తాడు. గొర్రె పుట్టినా, బర్రె చచ్చినా, కాకి ఎగిరినా, కోకిల కూసినా, అవి కవితా ప్రేరణలవుతాయి. ప్రసాద్ రచించిన ఈ కవితలన్నీ ఆ తరహాకే చెందుతాయి. వీటిల్లో కొంత వైచిత్రి కూడా వుంటుంది. ఈ కవి అంటాడు

దూరంగా దీపం
దానిని కాపాడుతూ
అంతులేని చీకటి

నిజానికి దూరానవున్న చీకటి దీపాన్ని కాపాడే నిమిత్తం కాదు అక్కడ వున్నది; దీపపుకాంతి అంతదూరం వరకూ ప్రసరించనందున వున్న ఆ చీకటి. ఈ సహజమైన సామాన్య సత్యాన్ని తీసుకొని దాన్ని కవితా

సత్యంగా మలిచాడు ఈ కవి. అబద్ధమైన అసత్యాన్నిగా రూపొందించాడు, నిజమైన సత్యాన్ని తీసుకొని. కవితలో కొంత అబద్ధం పరోక్షంగా దాగివుంటుంది! కొన్ని స్వభావోక్తులు అతిశయోక్తులుగా మారతాయి.

ఆధునిక కవితలో అనుభూతి కంటే ఆలోచన ప్రధానమని అంటారు. కాని నేటి అతి ఆధునిక కవితలో తిరిగి అనుభూతి తగినంతగా చోటు చేసుకొంటుంది. ఇక ముందుముందు ఎన్నో మార్పులు వస్తాయి. మారుతుండటం మాత్రమే ప్రగతికి లక్షణం కాదు కాని, మారక వుండటం కూడా కాదు.

మరో కవిత –

నల్లని కాన్వాసుపై
మరింత నల్లని చిత్రాలయి
ఇళ్ళూ, చెట్లూ

ఇది అక్షరాల కవిత కాకుండా రంగులచిత్రం అయివుంటే ఎంత బాగుండేదో! నల్లని రంగుపైన అంతకంటే ఎక్కువ నల్లనిరంగును చూపటంలో ఎంతో రమ్యత గోచరిస్తుంది నిపుణదృష్టికి. ఇదే నిండు దృశ్యకవిత. చిత్రకారుని కుంచెతో రచించిన కవిత! ఇదే నిజమైన హైకూ.

పై కవిత కంటికి సంబంధించి వుంటే ఈ క్రింది కవిత ముక్కుకు సంబంధించి వుంటుంది. ఒకటి చిత్రం రెండోది పరిమళం.

హిమాలయాలు
మార్మిక పరిమళాలు వీచే
మల్లెపూలు

చిన్నచిన్న మామూలు మాటల్లో పెద్దపెద్ద స్పందనలను రేకెత్తిస్తాయి పై పంక్తులు. ఇంద్రియ సంవేదనద్వారా అతీంద్రియ తన్మయత! ఈ కవి దృష్టియే సృష్టి!!

ఇటువంటి శుద్ధరసదృష్టివల్ల సామాజికశ్రేయం ఏమిటి? దానివల్ల వేరే శ్రేయం ఏమిటి? రసదృష్టియే స్వయంగా శ్రేయం. సమాజంలో రసదృష్టి, రససృష్టి లేకపోవటం అశ్రేయం. సమాజానికి శ్రేయాలు

అనేకవిధాలు. వాటిలో రససంస్కృతి అతి సున్నితమైన శ్రేయం – అతి సూక్ష్మ ప్రయోజనం, అతి సుకుమార అభివ్యక్తి. పండు మాత్రమే శ్రేయం కాదు, పూవుకూడ.

ఈ కవితలన్నిటినీ పరిశీలిస్తే వ్యక్తమౌతుంది ఈ కవి సూక్ష్మభావుకుడని. ఇవి ఆ కవిలోని ప్రథమ ప్రయత్నాలైనా ఫలితాలు ప్రాధాన్యాన్ని కలిగివున్నాయి ఎంతగానో.

రసదృష్టికి కవిసృష్టికి కొంతభేదం వుంటుంది. రసదృష్టి ప్రకృతిని ఎంతగానో చూడగలదు. కాని ఆ చూచినదాన్నంతా కవి తన కవితలో సృష్టించలేడు. కారణం దృష్టికి వున్న స్వేచ్ఛ సృష్టికి వుండదు. ద్రష్టశక్తి అపరిమితం. స్రష్టశక్తి పరిమితం. అంటాడు అందుకే సోమర్‌సెట్‌మాం

We do not write
as we want to
but as we can.

మనం కోరినట్లుగా మనం వ్రాయం అట, మన చేతనయినట్లుగా మనం వ్రాస్తాం అట. చూడటానికి కళ్లు అడ్డురావు, వ్రాయటానికి పదాలు వస్తాయి అడ్డు. పదాలులేని కవిత వుండదు, అయినా ఆ పదాలే రచనకు అడ్డు అవుతాయి అపుడపుడు.

మరో కవిత –

పూవు పేరు చెప్పాను
అతని చూపులో
పూవు చెరిగి, పేరు మిగిలింది

ప్రతిదానికి నామం, రూపం ప్రధానాలు. కొన్నిటి నామాలు గొప్పగా వుంటే, మరి కొన్నిటి రూపాలు గొప్పగా వుంటాయి. పై కవితలో రూపానికంటే నామం గొప్పచేయబడింది విలక్షణంగా.

ఇకముందు మరో విధమైన కవితా రచనలు చేసి ప్రకాశిస్తాడని ఆశించటం కంటే గొప్ప ఆశ మరేముంటుంది?

(దృశ్యాదృశ్యం ముందుమాట: డిశంబర్ 1994)

# ప్రకృతీ, జీవితం హైకూలమయమే

బివివి ప్రసాద్

ప్రకృతిలోని, మానవప్రకృతిలోని అతి సున్నితమైన ప్రకంపనలని పదచిత్రాలుగా ప్రదర్శించేది హైకూ. హైకూలో మార్మిక సంగీతమే ప్రధానం, సర్వస్వం. పాఠకుని అంతర్ముఖుని చేసి, లోలోతుల్లోకి మేల్కొల్పేది మార్మికసంగీతం.

హైకూ కవి ధ్యానంలో, మౌనంలో, ఆనందంలో వుంటాడు. ధ్యానం అంటే కనులు మూసుకోవటం కాదు, తనలోపల మేలుకొని ఉండటం. ఆ స్థితిలోకి ప్రపంచం ఒక కలలాగా ప్రవేశించి అదృశ్యమౌతూ వుంటుంది. కవికి ప్రపంచం, మంచులోంచి కనిపించినట్టు అస్పష్టంగా గోచరిస్తుంది. లేదా తెలిసిన ప్రపంచమే, పూవులే మళ్లీ కొత్తగా పరిచయమౌతూ విస్మయాన్ని కలిగిస్తూ వుంటాయి. అలాంటి స్పష్టాస్పష్టతనీ, విస్మయాన్నీ తెలియచేస్తూ, ప్రపంచానికీ, తనకీ నడుమ నిర్మించుకొనే వారధి హైకూ అవుతుంది. హైకూ అనుభూతిలో మొగ్గలాగా విడీవిడనితనం వుంటుంది, లేదా అప్పుడే విచ్చుకొన్న కొత్తదనం వుంటుంది.

దృశ్యానికీ, అదృశ్యానికీ; శబ్దానికీ, నిశ్శబ్దానికీ మధ్య సున్నితమైన సరిహద్దురేఖ హైకూ. హైకూకవి ఆ సరిహద్దులలో సంచరిస్తూవుంటాడు. దృశ్యంనుంచి అదృశ్యానికీ; శబ్దంనుంచి నిశ్శబ్దానికీ కవి పాఠకుని తీసుకెళతాడు. ఆ నిశ్శబ్దం, శబ్దం కంటే చైతన్యవంతంగానూ, అదృశ్యం దృశ్యంకంటే రసమయంగానూ వుంటాయి.

హైకూ కవికి జ్ఞానేంద్రియాలు సాధారణ చైతన్యాన్ని మించి జాగృతమైవుంటాయి. అలాంటి సమయంలో అతని కనులు రూపాలని చూడగలగటం మాత్రమే కాక, శరీరానికి తెలిసే చల్లదనాన్నీ, చెవికి తెలిసే శబ్దాలనూ కూడా చూడగలుగుతాయి. అలాగే చెవులు వినటమే కాకుండా, స్పృశించగలుగుతాయి. బహుశా, ఒక జ్ఞానేంద్రియం సమగ్రంగా మేలుకొన్నపుడు, మిగతా ఇంద్రియాల శక్తి దానికి ఉంటుందేమో! కనుకనే

అంధులకి శబ్దగ్రహణ శక్తి కనులున్నవారికంటే, చాలా ఎక్కువగా వుంటుంది.

హైకూ కవికి ప్రపంచంపై ప్రేమవుంటుంది, ఉదాసీనత కూడా వుంటుంది. వేరువేరు సమయాలలో కాక, రెండూ ఏకకాలంలో వుంటాయి. ప్రేమ శిఖరాగ్రానికి చేరినపుడు, సాధారణ దృష్టికి అది ఉదాసీనతలా గోచరిస్తుంది. ప్రతిక్షణం, ప్రతిచర్యలో తాను ప్రేమించవలసింది దేనినో గుర్తిస్తూనే వుంటాడు. పక్షిని ప్రేమించేవాడు పంజరంలో పెడతాడు; పక్షిని ప్రేమించటమంటే, పక్షి స్వేచ్ఛను ప్రేమించటమే అని తెలిసినవాడు, ఉదాసీనుడిగా కనపడే మహా ప్రేమికుడౌతాడు.

హైకూ కవి అంతర్ముఖుడై వుంటాడు. తనవరకూ చూసుకోవటం అంతర్ముఖం కాదు. తనలోనికి చూసుకోవటం అంతర్ముఖం. తన మూలాలను వెదుకుకోవటం అంతర్ముఖం. తనలోతుల్లోంచి ప్రపంచం లోతుల్లోకి చూపుసారించటం అంతర్ముఖం. తాను రూపొందిన మట్టిని మరిచిపోవటం అంతర్ముఖునికి సాధ్యంకాదు. కొలను అంతర్ముఖమైనపుడు మాత్రమే, ఆకాశం కొలను లోతుల్లోకి ప్రవేశిస్తుంది. కొలను బహిర్ముఖమైతే, ఆకాశం నీటి అంచున మాత్రమే తేలుతుంది.

ప్రకృతీ, జీవితం హైకూలమయమే. హైకూ కవి, కవి కన్నా, శాస్త్రజ్ఞునికి దగ్గరివాడనుకోవాలి. హైకూ కవి ప్రకృతిలోని హైకూలను కనుగొంటాడు – న్యూటన్ భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్నట్టు. హైకూ ప్రధానంగా discovery యే కానీ, creation కాదనుకొంటాను. కనుకనే హైకూ కవికి రాసేటపుడు శిల్పం అంతగా అవసరంలేదు; కానీ ప్రకృతిలో హైకూని చూసేటపుడు కావాలి. ఉన్నది ఉన్నట్టు రాయగలిగితే చాలు. కాని రాయతగిందా, కాదా అని మాత్రమే చూసుకోవాలి. కనుకనే హైకూని 'ఒక జీవన విధానం' అన్నారు.

కవుల సందేశాలవలే హైకూ కవుల సందేశాలు భిన్నభిన్నంగా వుండవు. ప్రకృతీ, జీవితం, ప్రాణులపట్ల అపరిమితమైన ప్రేమ మాత్రమే వారి వస్తువు. ఆర్ద్రత, మౌనం, ధ్యానం లేదా అంతర్ముఖం, ఏకాంతవాసం వారి లక్షణాలు. అపారమైన ప్రేమ ద్వారా, నిర్మలమైన ఆనందం ద్వారా,

మరింత ఉన్నతమైన జీవితానుభవాన్ని పొందటం, పంచటం వారి లక్ష్యాలు.

మంచి హైకూ కవి కావటానికి, ఒకరు ముందు కవి కావాలి, తరువాత కవి కాకుండా పోవాలి. హైకూ కవి ప్రపంచాన్ని అస్పష్టంగా చూస్తాడు; కొత్తగా చూసినంత స్పష్టంగానూ చూస్తాడు; ఎవరూ చూడని లోతుల్లోకీ చూస్తాడు. ఎలా చూసినా, ఆ చూపులో తడి మినహా, ఇతర కవులలో వలే కలల ముద్రలూ, ఉద్వేగమో, రొమాంటిసిజమో ఏర్పరచే ముసుగులూ వుండవు. ఆ చూపు మౌలికంగానూ, వాస్తవంగానూ వుంటుంది. అతని అస్పష్టత కూడా, ఇంద్రియ సంబంధమైందేకాని, హృదయ సంబంధమైంది కాదు.

సమాజం స్థూలాంశం. మనిషి మౌలిక స్వభావం సూక్ష్మాంశం. హైకూ కవి స్థూలంనుంచి, సూక్ష్మానికి ప్రయాణిస్తాడు. కనుక అతనికి వుండే, యావత్తు జీవితానికి సంబంధించిన స్పృహ, సమాజస్పృహ కంటే, ఉన్నతమైందే కానీ, భిన్నమైందో, వ్యతిరేకమైందో కాదు. కనుకనే హైకూలలో మానవ వేదనలూ వుంటాయి. అలాంటిచోట్ల వేదన మాత్రమే వుంటుంది. వేదన చెందే వారిపై ప్రేమ మాత్రమే వుంటుంది. ప్రేమలోంచే అతని పరిష్కారం వుంటుంది.

హైకూలలో ప్రధానమైనది ఆర్ద్రత. హాస్యంకూడా వుంటుంది. ఆ హాస్యం కూడా ప్రేమనించీ, ఆర్ద్రతనించీ జనించే హాస్యమైవుంటుంది. అలాంటి హాస్యంలో నవ్వు పెదాల చివర్లనించే కాక, హృదయం లోపల్నుంచీ వస్తుంది.

ప్రకృతిలో, జీవితంలో కనిపించే మెరుపు కానీ, మార్మికధ్వనికానీ, సంగీతం కానీ హైకూ అవుతుంది. జీవితంలో కనిపించే paradox కానీ, నిశ్చల ప్రకృతిలో ఒక పూవు రాలటంవంటి contrast వున్న దృశ్యాలు కానీ హైకూలు అవుతాయి.

హైకూలో ఒక కాలం, ఒక స్థలం మాత్రమే వుంటాయి. వేరువేరు స్థలకాలాలు ఒకే హైకూలో ఇమడవు. ఒక దృశ్యం, ఒక అనుభూతిని మాత్రమే హైకూలు భరించగలవు. అలాగే మనోభావాలవంటి నైరూప్య

విషయాలను సూచించే పదాలు (ప్రేమ, జాలి, దు:ఖం, విసుగు వంటివి) హైకూలలో అరుదు. సమర్ధవంతమైన హైకూలు ఆ పదాలు లేకుండానే, ఆ అనుభూతుల్ని కలిగించాలి. హైకూ అభివ్యక్తికి two dimentions మాత్రమే ఉపయోగించాలి. ప్రతి హైకూలో third dimention వుంటుంది, కానీ, అది ధ్వనిగానే వుంటుంది; వాచ్యంగా వుండదు. అభివ్యక్తిలో స్పష్టత, సాదాతనం మంచి హైకూ లక్షణాలు.

హైకూ ఇచ్చిన అనుభూతి పాఠకుని వెంటాడాలి కాని, హైకూలోని కవిత్వం వెంటాడకూడదు. అలంకారాలులేని సరళమైన అభివ్యక్తిలో ఇది సాధ్యమౌతుంది. మెరుపుని చూసిన అనుభూతిలో మెరుపురూపాన్ని విస్మరించినట్లు, హైకూ అనుభూతినిచ్చి అదృశ్యం కావాలి. హైకూ తననుంచి పాఠకునికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అది కవిత్వంలా పాఠకుని కళ్ళపై తన images ని ముద్రించదు. పాఠకుని మేలుకొల్పి వెళ్ళిపోతుంది. కవిత్వం చదివే mood లో మంచిహైకూ చదివితే, చాలాసార్లు ఇందులో ఏముంది అనిపిస్తుంది. హైకూ చదివే పాఠకులు కూడా తాను చదువుతున్నది కవిత్వం కాదనీ, హైకూ అనీ స్పష్టంగా గ్రహించాలి. హైకూలో కవి తక్కువ రాసినట్టు కనిపించి, దానినుంచి పాఠకుడు ఎక్కువ అనుభూతి పొందే అవకాశం ఇవ్వాలి. హైకూ కవి పాఠకుని, తన కంటే ఉన్నతమైన కవిగా భావించాలి.

తెలుగులో హైకూ చాలా వరకూ సరి అయిన అవగాహనతోనే ప్రారంభమైంది. నలుగురైదుగురు కవులు, మంచి స్థాయి కలిగిన హైకూలనే ఎక్కువగా రాసారు. అయితే కవిత్వం నించి, హైకూని విడిగా, స్పష్టంగా గుర్తించవలసి ఉందనిపిస్తుంది. అలాగే హైకూని కేవలం రూప (form) ప్రధానమైన ప్రక్రియగా కాక, సార (content) ప్రధానమైన ప్రక్రియగా, స్వీయ దార్శనికత కల (బహుశా, ఏకైక) ప్రక్రియగా గుర్తించవలసి ఉందనుకొంటాను. హైకూ, రూపానికి సంబంధించిన నియమాలతో ప్రారంభమైనా, కవిత్వం ఛందోపద్యంనుండి విముక్తమైనట్లు, హైకూ కూడా, విదేశాలలో ఇప్పుడు ఒకటీ, రెండూ పాదాలలో కూడా రూపొందుతూ వుంది.

ఈ మధ్య చాలామంది హైకూలు రాసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఆహ్వానించదగిన పరిణామం. హైకూ కవిత్వంగా మాత్రమే కాక, ఒక సంస్కృతిగా కూడా వ్యాపించాలి. అయితే హైకూలో అస్పష్టత, నెగటివ్ మనస్తత్వం, కేవలం ఆలోచన వంటివి వాంఛనీయం కాదు. అవి హైకూ మౌలిక తత్వానికి విరుద్ధం. అనుభూతీ, మార్మికమైన లోతూ, సరళత హైకూ ప్రధాన లక్షణాలు.

ఒక విషయం ఎపుడూ దృష్టిలో వుండాలి. హైకూ రాయటం సులువే, మంచి హైకూ రాయటం మరీ సులువు; హైకూ కవి కావటమే కష్టం.

(ప్రచురితం: ఆంధ్రభూమి దినపత్రిక 22.9.1996 'సాహితి' అనుబంధం.)

# హైకూ అంటే జీవనస్పృహ

బివివి ప్రసాద్

"దృశ్యాదృశ్యం'' "హైకూ'' పేర్లతో రెండు హైకూ సంపుటాలు ప్రచురించాక నేనింకా హైకూని అర్ధం చేసుకొనే లేదా చేరుకొనే ప్రయత్నంలో వున్నాను. ఈ క్రమంలో నాలో నాకు ఎదురైన ప్రశ్నలకి, నా చుట్టూ ఎదురైన ప్రశ్నలకి నాకు తెలిసినంత వరకూ జవాబులు రాయదలిచాను. హైకూ అంటే ఏమిటి? ఎందుకు చదవాలి? ఎలా చదవాలి? ఎలా రాయాలి? హైకూ పట్ల అపోహలేమిటి? ఈ క్రమంలో రాస్తాను.

## హైకూ అంటే ఏమిటి?

హైకూ అంటే ఒక పదచిత్రం. ఆ పదచిత్రం సున్నితమైన అనుభూతినీ, ఆ అనుభూతి అంతరాంతరాలలో హృదయం మేలుకొన్న అనుభవాన్నీ కలిగించాలి. హైకూ అంటే ఎప్పటికీ తాజాగా వుండే మెలకువ. హైకూ రాయటమంటే మెలకువ పట్ల మెలకువ. ప్రకృతిలోని సున్నితమైన కదలిక లేదా నిశ్చలత, కవిలో అతి సున్నితమైన కదలిక కలిగిస్తే, ఆ అనుభూతిని ఆవిష్కరించే ప్రయత్నం హైకూగా రూపొందుతుంది. హైకూ, పాఠకునిలో తటాలున హృదయం వికసించిన లేదా మేలుకొన్న అనుభవం కలిగిస్తుంది.

మన ఇంద్రియాలు సమర్ధంగా మేలుకొని వుండవు. 'నేను అంటే నా శరీరం మాత్రమే' అనుకొనేవారిలో, అవి మరీ నిద్రాణంగా వుంటాయి. ఇంద్రియాలు సమగ్రచైతన్యంతో మేలుకొంటే సున్నితం, సూక్ష్మం, కాంతివంతం అయిన ఉదాత్తజీవితం అనుభవమౌతుంది. ఆ అనుభవం మనిషిలో ఉదాత్తగుణాలు మేలుకొనేలా చేస్తుంది.

కవిత్వం వర్ణచిత్రం వంటిది. హైకూ ఆ చిత్రం వేసే తెల్లకాగితం వంటిది. కవిత్వం సంగీతం వంటిది. హైకూ ఆ సంగీతానికి ప్రాతిపదిక అయిన నిశ్శబ్దం వంటిది. కవిత్వం చిత్రిస్తుంది. హైకూ చెరుపుతుంది. మన

ఉద్వేగాలూ, ఆందోళనలూ, సంక్లిష్టతలూ చెరుపుతుంది. సరళం, సహజం అయిన మన నిజస్థితిని అనుభవానికి తెస్తుంది.

## హైకూ ఎందుకు చదవాలి?

మానవస్వభావం మౌలికంగా కరుణామయం. నమ్రత, ఓర్పు, త్యాగం, ధైర్యం, సరళత, సానుభూతి వంటి ఉదాత్తగుణాలకు నిలయం. జీవించటంలో ఎదురయ్యే సంక్లిష్టత, జడత్వం మన మౌలికస్వభావానికి మనని దూరం చేస్తాయి. ఉదాత్తగుణాలతో జీవించటం వలన కలిగే ఆనందం, అలా జీవించనప్పుడు కలగదు. మన సహజస్థితికి దగ్గర కావటమే, అటువంటి ఆనందానికి కారణం. హైకూ మన మౌలిక స్వభావం మేలుకొనేలా చేస్తుంది.

హైకూ మార్మిక కవిత. మార్మికత అంటే మౌలిక సత్యాల అన్వేషణ, అనుభవం. దృశ్యంనుంచి అదృశ్యానికీ, శబ్దంనుంచి నిశ్శబ్దానికీ హైకూ నడిపిస్తుంది. తెలిసినదానినుంచి తెలియనిదానికి నడిపిస్తుంది. మనిషికి తన మౌలిక అస్తిత్వం గురించి కొంత తెలుసు. తెలియంది ఎంతో వుంది. తెలియనిదానిని భయంతో, అహంతో నిరాకరించటం, ఉపేక్షించటం సరికాదు. తెలిసినదానినుంచి, తెలియనిదానికి ప్రయాణిస్తూ వుండటమే వికాసం. పురోగమనం. భౌతికశాస్త్రాల పురోగమనానికి ఇదే ప్రాతిపదిక. సాంస్కృతికశాస్త్రాలు - కళలూ, సాహిత్యం - మానవ జీవిత వికాసానికి ఇదే పని చేయవలసివుంది. హైకూ మన మౌలిక అస్తిత్వంవైపు పురోగమించేలా చేస్తుంది.

ప్రాకృతిక వస్తువులతో మన మౌలికమైన ఐక్యాన్ని సిద్ధింప చేసుకోవటం హైకూ అనుభవం అని చెబుతారు. ప్రకృతి పరిణామం మనిషి. ప్రకృతిలో భాగంగా మాత్రమే ఉన్నతుడు, ప్రకృతికి అతీతంగా కాదు. వేర్ల పరిణామ ఫలితం చిటారుకొమ్మ. అది చెట్టుకి అతీతంకాదు. చెట్టునించి వేరుచేస్తే జీవం కోల్పోతుంది. మనిషీ అంతే. మన వేర్లు ప్రకృతిలోనే వున్నాయి. భౌతికంగా, హృదయంలోకూడా. మన మౌలిక లక్షణాలైన

జీవచైతన్యాన్నీ, ఆర్ద్రతనీ ప్రకృతినించే పీల్చుకొంటాం. హైకూ ప్రకృతికి మరలించి, మనలోని మన సహజ సౌందర్యాన్నీ, జీవ లక్షణాన్నీ తిరిగి పొందేలా చేస్తుంది.

హైకూ చికిత్సా కవిత్వం అంటారు మిత్రులొకరు. ఆధునిక మానవుడు ఎక్కువగా కృత్రిమ జీవితం గడుపుతున్నాడు. ఫలితంగా తనలో ఏర్పడే వత్తిడి వలన మానసిక అస్థిరతకి గురికావటం జరుగుతుంది. మనం గడిపే కృత్రిమ జీవితాన్ని మరిపించి, మన సహజమైన, ప్రాకృతిక జీవితాన్ని గుర్తుచేసి -హైకూ- ప్రశాంతతనీ, జీవించే నమ్మకాన్నీ, ఉత్సాహాన్నీ, ధైర్యాన్నీ కలిగిస్తుంది.

## హైకూ ఎలా చదవాలి?

హైకూని అర్థం చేసుకోవటం కాదు, అనుభూతి చెందాలి. హైకూ చదివేందుకు మేథ కాదు, హృదయం పనిచేయాలి. హైకూకి ఏదైనా అర్థం తట్టినా, ఏ అర్థం తట్టకపోయినా పాఠకుడు విఫలమైనట్టే. హైకూ, పాఠకునికి హృదయం మేలుకొన్న అనుభవాన్నివ్వాలి. లేకుంటే హైకూలోనో, పాఠకుని సంసిద్ధతలోనో లోపం వుందనుకోవాలి.

కవిత్వంలో 'అలంకారాలు అర్థం కావటం' ద్వారా అనుభవం కలుగుతుంది. హైకూలో అలంకారాలు వుండవు. హైకూ అర్థం కావటానికి కవిత్వ శాస్త్రపరిజ్ఞానం కాదు; అంతర్ముఖదృష్టికి సంసిద్ధత, సున్నితం, ఆర్ద్రం అయిన హృదయం, ప్రాకృతిక సౌందర్యంతో మమేకం పొందగల చైతన్యం, బహుశా ఏకాంతంగా మౌనం, దు:ఖం భరించివుండటం, లేదా భరించగల శక్తీ అవసరం. కవిత్వం రాసే, చదివే చాలామందిలో ఈ లక్షణాలు వుంటాయి. వారు హైకూ అనుభవానికి త్వరగా సిద్ధం కాగలుగుతారు.

కవిత్వానికీ, హైకూకీ పాఠకునికి కావలసిన ప్రాథమిక అర్హత సృజనశక్తి కలిగివుండటం. అది లేని పాఠకుడిని ఏ సాహిత్యమూ ఏమీ చేయలేదు. మానవ లక్షణాలలో సృజనశీలత ఒకటి. కలలూ, ఊహలూ లేని

మనిషి వుండడు. ఈ లక్షణం చాలామందిలో బలహీనంగా వుంటుంది. అది కూడా యాంత్రికమూ, జడప్రాయమూ కావటం ఆధునిక యాంత్రిక జీవితంలో కనిపిస్తుంది.

## హైకూ ఎలా రాయాలి?

హైకూలు రాయటం కన్నా, హైకూ కవి కావటం కష్టం. హైకూ కవి జీవితాన్ని ప్రేమించేవాడై వుండాలి. తన జీవితాన్ని కాదు; స్వపరభేదం లేకుండా జీవించటమనే లక్షణాన్ని. ప్రతికూల పరిస్థితులలో కూడా మానవత్వం పట్ల, మనిషి పట్ల నమ్మకం, ప్రేమ వుండాలి. తాత్కాలిక ఉద్వేగాలు తప్పవు. కాని ఈ లక్షణాలు మౌలిక స్వభావంగా వుండాలి. ప్రకృతి పట్ల సహజమైన ప్రేమ, సౌందర్యదృష్టి, విస్మయంతో చేసే పరిశీలనా వుండాలి. ఆంతరిక ఆనందం పట్ల ఆసక్తీ, బాహ్య సుఖాల పట్ల వీలైనంత ఉపేక్షా వుండాలి. ఈ లక్షణాలు వుంటే ఆంతరిక చైతన్యం పెరుగుతుంది. ఇంద్రియాలు సమగ్రంగా మేలుకొంటాయి.

హైకూలు రాసేందుకు కొంతవరకైనా కవిత్వం రావాలి. సరాసరి హైకూ రాయటం అంత సులువు కాదు. అనుభూతికీ, అక్షరాలకీ మధ్య చాలా దూరముంటుంది. కవిత్వంలో అలంకారాలు దూరాన్ని చెరుపుతాయి. హైకూలో అలంకారాలు వుండవు గనుక, మరింత సాధన అవసరమౌతుంది. ఏ ఊహల సహాయమూ తీసుకోకుండా, సహజత్వాన్ని జీవితంలోని నిస్సారాన్ని మినహాయించి పట్టుకోవటం చాలా కష్టం. కాని సహజత్వంతో పోలిస్తే అలంకారాలు కూడా మొరటు. హైకూ చేరాల్సిన సున్నితం, సూక్ష్మం అయిన గమ్యానికి అవి అడ్డు వస్తాయి.

హైకూలో కవి ప్రమేయం కనిపించకూడదు. పాఠకునికీ, అనుభవానికీ మధ్య కవి అడ్డుకాకూడదు. అలంకారాలలో కవి ప్రమేయం కనిపిస్తుంది. అలంకారాలు లేకున్నా కవి ప్రతిభ వ్యక్తమౌతుంది. పికాసో గురించి ఇస్మాయిల్ గారన్నట్లు "గీసింది కన్నా చెరిపింది ఎక్కువ" వుండాలి. హైకూలో కవి ప్రతిభ "అలంకారాల"లా కృత్రిమంగా కాక, చార్మిక

సౌందర్యంలా సహజంగా హైకూలో కలిసిపోయి వుంటుంది.

హైకూకి సున్నితమైన అనుభూతి కావాలి; బలహీనమైన అనుభూతి కాదు. సున్నితమైన అనుభూతి, అంతరాంతరాలలో కలిగే మృదువైన ప్రకంపన. బలహీనమైన అనుభూతి ఉపరితలంలో కలిగే స్వల్ప ప్రకంపన. సున్నితమైన అనుభూతిలో అపారమైన చైతన్యం వుంటే, బలహీనమైన అనుభూతిలో జడత్వం ఎక్కువ వుంటుంది.

హైకూ ఆర్ద్రతని, ఉదాత్త గుణాలని మేలుకొలిపేలా వుండాలి. ఉదాత్త గుణాలలోనూ ఆర్ద్రత అంతర్లీనంగా వుండాలి. సంతోషం, దు:ఖంవంటి అనుభూతులు ఆర్ద్రత కలిగిస్తే మంచివీ, ఆర్ద్రత కోల్పోయేలా చేస్తే మంచివి కానివీ అవుతాయి.

హైకూకి ప్రకృతి తగిన వస్తువు. ప్రకృతి ఒక్కటే బాహ్యప్రపంచంలో స్వచ్ఛమూ, సరళమూ అయినది. హైకూవంటి సున్నితమైన అనుభవం, ప్రకృతిలాంటి అతి సరళమైన మాధ్యమం ద్వారానే వ్యక్తమౌతుంది. ఏ కాంక్షాలేని మమేకత్వం, ప్రకృతి పట్ల సాధ్యమౌతుంది. కాంక్షవుంటే సమగ్రమైన తాదాత్మ్యత వుండదు. ప్రకృతి ఒక్కటే అతి ప్రాచీనం. అతి నవీనం. నిరంతరాయంగా ఆవిష్కృతమయ్యే జీవశక్తి.

హైకూ పదచిత్రంగా వుండాలి. ప్రకృతికి చెంది వుండాలి. రుతువుల ప్రస్తావన వుంటే మరీ మంచిది. ప్రకృతి సహజంగా సజీవమైనా, రుతువులలో ఆ జీవచైతన్యం మరింత స్పష్టంగా ఆవిష్కారమౌతుంది.

హైకూలోని కదలిక లేదా నిశ్చలత వర్తమానంలో చూస్తున్నట్టు వుండాలి. వర్తమానానికి వుండే చైతన్య లక్షణం - గతానికీ, భవిష్యత్తుకీ ఉండదు. చేసాను, చేయదలిచాను, జరిగింది, జరగబోతుంది అనికాక చేస్తున్నాను, జరుగుతూంది అని వుండాలి. వర్తమాన దృశ్యంలో గతాన్నో, భవిష్యత్తునో తలచటం కొన్నిసార్లు వుంటుంది.

హైకూ సంక్షిప్తంగా వుండాలి. అలంకారాలలాగే, శబ్దాల విస్తృతి కూడా సున్నితమైన అనుభవం కలిగించేందుకు అవాంతరంగా వుంటుంది. సంక్షిప్తతకి వుండే శక్తి విస్తృతికి వుండదు. తెల్లటి మంచు కురుస్తోంది,

మంచు కురుస్తోంది అనే వాక్యాలు చూపించే దృశ్యాన్ని మంచు అనే పదంతోనే ఆవిష్కరించవచ్చు. అరుదుగా, అలాంటి సూచనా పదం కాక, వివరణ వాక్యం అవసరమౌతుంది.

కవికి స్వంతశైలి వుండాలి. కవిత్వమంటే వస్తువూ, అభివ్యక్తీకాదు. అవి మాధ్యమాలు మాత్రమే. కవిత్వమంటే కవి అక్షరరూపంలో నిలబడటం. హైకూ కవిగా జీవిస్తే, హైకూలు వాటంతట అవే అప్రయత్నంగా వస్తాయి. నిజానికి ప్రయత్నం నశించిన చోట హైకూ వుంటుంది. ప్రయత్నం నశించటమంటే నిద్రపోవటం కాదు, అసాధారణ చైతన్యం, మెలకువ కలిగివుండటం.

హైకూకి సమాంతర ప్రక్రియ మరొకటి వుంది సెన్ర్యూ. హైకూలో ఆర్ద్రత ప్రధానమైతే, సెన్ర్యూలో సున్నితమైన వ్యంగ్యం వలన కలిగే హాస్యం ప్రధానం. సెన్ర్యూలో ప్రకృతి మాత్రమే కాక, సామాజిక అంశాలూ వుంటాయి. సెన్ర్యూలు కూడా హైకూలలా నిరలంకారంగా, హృద్యంగా, అంతర్ముఖంగా వుండటం ముఖ్యం.

## హైకూ పట్ల అపోహలేమిటి?

తెలుగులో హైకూ ప్రచారానికి వచ్చి ఏడెనిమిది సంవత్సరాలు కాలేదు. అప్పుడే మంచి హైకూలు మాత్రమే ఆశించటం సరైంది కాదు. హైకూని కవిత్వంకన్నా భిన్నంగా, పూర్తి హైకూతత్వంతో ఆవిష్కరించవలసి వుంది. హైకూ సున్నితం, ఉదాత్తం కనుక, మంచి హైకూ కోసం చాలా సాధన కావాలి.

ఇప్పటికి హైకూ అర్థమై రాస్తున్నవారు ముగ్గురు, నలుగురు మాత్రమే వున్నారు. వారివీ అన్ని హైకూలూ సమానంగా శ్రేష్టమని చెప్పలేం. కవిత్వంలో కూడా, ఏ ఉత్తమ కవివీ, అన్నీ ఉత్తమ కవితలు కాలేవు. ఉత్తమప్రమాణాలు సాధించే ప్రయత్నంపట్ల సహృదయత అవసరం. అకస్మాత్తుగా ఎవరూ ఏ పరిణతీ పొందరు కదా.

మిగిలినవారిలో చాలామందికి హైకూ అర్థం కాలేదు. హైకూ అంటే

ఒక అలంకారమనీ, కవిగా పేరు తెచ్చుకొనేందుకు, హైకూ సులువుదారి అనీ భావిస్తున్నారు. కవిత్వంలోనూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి వుంటుంది. కవిత్వం పేరుతో తోచిన పదాలు పేర్చేవారు, మంచి కవులకంటే ఎక్కువ సంఖ్యలో వుంటారు. నిజాయితీ, ఓపికా వున్న కొందరు, ప్రాథమిక స్థాయినుండి మంచికవిగా పరిణతి చెందటం వుంటుంది.

హైకూ అంటే రూపం కాదు, సారం అని గ్రహించాలి. గేయం, పద్యం, వచనకవిత, మినీకవిత రూప ప్రధానమైన ప్రక్రియలు. హైకూ తత్త్వ ప్రధానమైన ప్రక్రియ. అక్షర నియమం పాటించినా - ఏ ఆలోచన కానీ, అన్ని అనుభూతులూ కానీ - హైకూలు కాలేవు. పాటించకున్నా హైకూ అనుభూతులు, హైకూ కాకుండా పోవు. అక్షర నియమంతో ప్రారంభమైన జపాన్ హైకూలలోనూ ఆ నియమాన్ని ఉపేక్షించటం తరచూ జరిగేది. జపాన్ నుండి 50 - 60 దేశాలకు వ్యాపించినా, అన్ని దేశాలలోనూ రూపం కన్నా సారానికే ప్రాధాన్యత నిచ్చారు. విదేశాలలో హైకూ బాగా పట్టుబడిన కవులు - పాద విభజన అవసరం లేనపుడు - ఏక వాక్యంలో హైకూ సాధించటం జరుగుతోంది.

హైకూలు అందరికీ అందవు అంటారొకరు. సినిమా సాహిత్యం అందరికీ అందుతుంది. కవిత్వం కొందరికే అందుతుంది. సినిమా సాహిత్యం కవిత్వంకన్నా శ్రేష్టం కాదు కదా. కవిత్వం అందటానికి సున్నితమైన సంస్కారం అవసరం. హైకూ అందటానికి అంతకన్నా సున్నితమైన సంస్కారం అవసరం. అందదని కూర్చుంటే, మనిషికి వికాసం వుండదు. అందనివాటికి నిరాశ, ఉపేక్ష సరికాదు. అందుకొనే ప్రయత్నం చేయాలి. జీవించేందుకు ఇదే పాటిస్తాం కదా. ఒకరికి సాధ్యమైంది, ఎవరికైనా సాధ్యమౌతుంది. ప్రయత్నం చేయవలసిరావటంలో భేదాలు ఉండవచ్చు.

మినీకవిత దేశీయం, హైకూ విదేశీయం అని ప్రతిపాదనలు. మినీకవిత దేశీయమెలా అయిందో వారే చెప్పాలి. ఏ కులం, మతం, జాతి, ఏ ప్రాంతం, కాలం, ఏ వయస్సు, స్త్రీయా, మగవాడా - గుణాలు నిర్ణయించేందుకు ఇవి ప్రమాణాలు కావటం విచారకరం. ఇది పురోగమన

దృష్టి కాదు. గుణ నిర్ణయానికి మంచీ – చెడూ, రెండే ప్రమాణాలు. మంచి ఎవరిదీ, ఎక్కడిదీ, ఏ కాలానిదైనా స్వీకరించాలి. అలాగే చెడుని నిరాకరించాలి.

హైకూ మన సంస్కృతి కాదని వాదం. సంస్కృతి అంటే ఒక మానవ సమూహం జీవించే విధానం. ఇవాళ విడివిడి మానవ సమూహాలు సాధ్యం కాదు. ప్రగతిశీలం కాదు. ప్రపంచ మానవులంతా ఒకే సమూహంగా రూపొందుతూ వున్నాం. సైన్సూ, టెక్నాలజీ ఇప్పటికే మానవులని ఏకైక సమూహంగా తయారుచేసాయి. సంస్కృతి కూడా మానవ జీవితంతో పాటే చలనశీలమైంది. మన పూర్వులూ, మనమూ జీవిస్తున్న విధానం ఒకటి కాదు. ప్రపంచానికి మేలు చేసే ఏ మంచి సంస్కృతి అయినా, మానవులందరి సంస్కృతి. అలాగే ఎవరూ, తమ సంస్కృతిలో మేలుచేయని భాగం వుంటే, పోషించుకోనవసరంలేదు.

తాత్వికత, ఊహ వద్దు, వాస్తవం కావాలి అని ఒక ప్రతిపాదన. ఊహ లేనిది కవిత్వమెక్కడవుంది? స్వీయ తాత్వికత లేకుండా ఏ కవీ చెప్పేదేముంది? వస్తువుని కవి తన తాత్వికదృష్టితో ఆవిష్కరించటమే కవిత్వం. వాస్తవాలు కావాలంటే వార్తా పత్రికలు చదవాలి. పత్రికలకీ తాత్వికదృష్టి వుంటుంది. కనుక వాస్తవాలని స్వయంగా చూడాలి. తాత్వికదృష్టి లేని వ్యక్తీ వుండడు. శుద్ధ వాస్తవం ఎలా సాధ్యం? అలాంటిది ఏమైనా సాధ్యమైతే, హైకూకీ సాధ్యమౌతుంది. హైకూ అంటే మౌలిక సత్యాల లేదా వాస్తవాల అన్వేషణ.

మార్మికత అస్పష్టత కలిగిస్తుంది అంటారొకరు. మార్మికత అంటే మౌలికమైన, లోతైన ఆలోచన మాత్రమే కాదు, మౌలికమైన, లోతైన అనుభూతి కూడా. హైకూ అంటేనే అలాంటి అనుభూతి. మార్మికత లేనిది హైకూ ఎంతమాత్రమూ కాదు. హైకూ అస్పష్టంగా తోస్తే, అది అనుభూతిని అందించటంలో కవి వైఫల్యం కాని, అందుకోవటంలో పాఠకుని వైఫల్యం కాని అవుతుంది.

హైకూ ఆత్మాశ్రయం అని చెపుతారు. ఆత్మాశ్రయం రెండు

విధాలుగా వుంటుంది. సార్వత్రిక వ్యక్తి ఆత్మాశ్రయం, నిర్దిష్ట వ్యక్తి ఆత్మాశ్రయం. ధైర్యం, జాలి, ప్రేమ వంటి అనుభూతులు అందరిలో వుంటాయి. ఇవి సార్వత్రిక వ్యక్తికి చెందినవి. ఒకేసారి రెండు, అంతకన్నా ఎక్కువ అనుభూతులు కలిసి – ఒకే అనుభూతిగా రూపొందుతాయి. అలాంటి అనుభూతులకి కారణమైన పరిస్థితులు, వస్తువులు – నిర్దిష్టంగా వుంటాయి. అంటే ఏ వ్యక్తికి ఆ వ్యక్తిగా. ఇది నిర్దిష్ట వ్యక్తి ఆత్మాశ్రయం. హైకూ వస్తువులైన ప్రకృతి కాని, హైకూ అందించే అనుభూతులు కాని – సార్వత్రికమైనవి. కనుక హైకూని సార్వత్రిక ఆత్మాశ్రయం అని గ్రహించాలి.

ఆత్మాశ్రయం అని అంతర్ముఖ దృష్టిని అంటారు. అంతర్ముఖ దృష్టి అంటూ ఒక ప్రతిపాదన లేకుండా, బహిర్ముఖ దృష్టి సాధ్యం కాదు. కన్ను తనంత తాను, తన వెలుపలి (object)ని చూడలేదు. కన్ను చూడగలిగేందుకు, కంటిలోపలి వస్తువు ఒకటి (దర్శనశక్తి) ఉండితీరాలి. అంతర్ముఖ దృష్టి అంటే అలాంటి దర్శనశక్తి. కనుక ఆత్మాశ్రయం లేదా అంతర్దృష్టి ఉండితీరవలసిన గుణమే కాని, దోషంకాదు.

హైకూ నిబద్ధ కవిత కాదనీ, బాధ్యత లేనిదనీ నిరాకరిస్తారు. నిబద్ధత అంటే ఒక వస్తువు పట్ల పరిపూర్ణమైన శ్రద్ధా, దృష్టీ ఉండటం. అంటే హృదయం ఉంచటం. బహిర్ముఖ వస్తువులు నిబద్ధమనీ, అంతర్ముఖ వస్తువులు అనిబద్ధమనే విశ్లేషణ సరైంది కాదు. నిబద్ధత వస్తువుని బట్టి కాదు. హృదయాన్ని బట్టి గుర్తించాలి. హృదయం పలకని వస్తువుతో కవి ఏమైనా రాస్తే, తననీ, ప్రపంచాన్నీ మోసం చేసినవాడవుతాడు. నిజానికి బహిరంతర అన్వేషణలూ, ప్రశ్నలూ, వస్తువులూ – అన్నీ మాధ్యమాలు మాత్రమే. కవిత్వం అన్నా, హైకూ అన్నా ఒక హృదయం మరొక హృదయంలోకి ప్రవేశించటం. ఒక జీవితం మరొక జీవితంలోకి ప్రవహించటం. కనుక వస్తు నిబద్ధత కన్నా, హృదయ నిబద్ధత గమనించటం ముఖ్యం. అలాంటి నిబద్ధత కల ఏ కవిత్వమైనా ఉత్తమమైందే. అలా కానిది అంగీకారయోగ్యం కానిదే.

కవి ప్రధాన బాధ్యత మానవ జీవిత వికాసానికి దోహదకారి కావటం. మానవ సాంస్కృతిక వికాసానికి నాయకత్వం వహించటం. నిర్మాణదృష్టి

కలిగి వుండటం. బహిర్ముఖమైనా, అంతర్ముఖమైనా ఈ దృష్టి ప్రధానం. కవిత్వం చైతన్యాన్ని కలిగించాలి. ఆవేశాన్ని కాదు. ఆవేశం మత్తు పదార్థాలలా, తాత్కాలిక ఉత్తేజం కలిగిస్తుంది. అవి మానవుల శక్తినీ, వివేకాన్నీ క్షీణింపచేస్తాయి. ఆవేశాన్ని కలిగించటం సులువు గనుక, ఆవేశాన్ని చైతన్యంగా, కవిత్వానుభవంగా భావించటం సరైంది కాదు. చైతన్యం నిర్మాణదృష్టినీ, ఆవేశం విధ్వంసదృష్టినీ కలిగివుంటాయి. కనుక బహిరంతర కవిత్వాలలో చైతన్యం కలిగించేది బాధ్యతకల కవిత్వమనీ, ఆవేశం కలిగించేదీ, మానవత్వం పట్ల నమ్మకం కోల్పోయేలా చేసేదీ – బాధ్యతలేని కవిత్వమనీ గుర్తించాలి. హైకూ ఆంతరిక చైతన్యం కలిగించే కవిత్వం కనుక, బాధ్యతకల కవిత్వం.

హైకూ జీవితాన్ని గుర్తు చేస్తుంది. బహిర్ముఖ కవిత్వం "జీవించే అవకాశం" కావాలంటుంది. అంతర్ముఖ కవిత్వం "జీవించటం అంటే ఏమిటో" చెపుతుంది. బహిర్ముఖ కవిత్వగమ్యం ముగిసిన చోట, అంతర్ముఖ కవిత్వం ప్రారంభమౌతుంది. రాజకీయ, సాంఘిక సమస్యలూ, ఆంతరిక తాత్విక అన్వేషణా – మానవ చరిత్రలో నిరంతరాయంగా కొనసాగే చర్యలు. ఇవి సంస్కరింపబడుతూ, మరలా కొత్త రూపంలో ఎదురౌతూ, క్రమక్రమంగా, మనిషికీ, ప్రపంచానికీ మరింత మేలైన జీవితాన్ని ఇచ్చేవైపు పురోగమిస్తూవుంటాయి. మనిషి ఏకకాలంలో వ్యక్తీ, సమూహంలో భాగమూ కూడా. కనుక బహిరంతర ప్రయాణాలూ, ఏకకాలంలో, నిరంతరాయంగా కొనసాగుతూవుండాలి. రెండు ప్రయాణాల సాహిత్యాన్నీ, తగిన దృష్టితో స్వీకరించాలి.

అంతర్ముఖ కవిత్వం విస్తృతంగా రాకపోవటం, వచ్చినది కూడా సరిగా ప్రచారం కాకపోవటం వలన 'జీవించే అవకాశం' ఉన్న ప్రాంతాలలో కూడా – మానవులు సాంస్కృతికంగా పతనం కావటం గమనిస్తున్నాము. అంతర్దృష్టి లోపించటం వలననే జీవితమంటే శారీరక సౌఖ్యమూ, సాంఘిక గౌరవమూ మాత్రమే అనే బలహీన అభిప్రాయం వ్యాప్తి చెందింది. నిజానికి – జీవితమంటే – మనిషి తనలోని, ఇతరులలోని ఉదాత్త గుణాలు వ్యక్తం

కావటం ద్వారా ఆనందించటం.

## ముగింపు

కవిత్వం వేరు, జీవితం వేరు కాదు. కవిత్వమంటే అక్షరాలు కాదు. కవిత్వమంటే స్వప్నించటం. కవిత్వం జీవితంలో ఒక భాగం కాదు. జీవితానికి సమాంతర జీవితం కవిత్వం. మనిషి జీవించాలి. వ్యాపించాలి. వికసిస్తూ వుండాలి. కవిత్వంకూడా అంతే. జీవితానికి – ఆర్ద్రత, జీవించే నిష్ట, ఓర్పు, మెలకువ, నమ్మకం, అధ్యయనం, సరళత, నిజాయితీ, నమ్రత, పురోగమనశీలత అవసరం. కవిత్వానికీ అంతే.

ఎలాంటి స్పృహతో కవిత్వం రాస్తున్నా, అన్ని స్పృహలకీ ఆధారమైన జీవనస్పృహని కోల్పోకూడదు. హైకూ అంటే అలాంటి జీవనస్పృహ. హైకూని ఆహ్వానించుకొందాం.

(ప్రచురితం:
ఆంధ్రప్రభ దినపత్రిక 4 & 11.10.1998 'సాహితీ గవాక్షం' అనుబంధాలు.)

# హైకూ అంటే ఏమిటి?
# బివివి ప్రసాద్ తో శ్రీ నాగసూరి వేణుగోపాల్ రేడియో ఇంటర్వ్యూ

**హైకూ అంటే ఏమిటి?**

హైకూ అంటే ఒక పదచిత్రం. ఆ పదచిత్రం మనసులో సున్నితమైన అనుభూతిని కలిగించాలి. ఆ అనుభూతి లోపల ఒక విధమైన మెలకువ లాంటిది కలిగిస్తుంది, సౌందర్యం పట్ల.

**హైకూ కాకుండా మిగతారూపాల్లో రాయబడే కవిత్వం దీన్ని సాధించలేదా?**

కవిత్వానికి వుండే కాన్వాస్ వేరు. హైకూకి ఉన్న కాన్వాస్ వేరు. ఈ రెండింటి మధ్యా కొంత పోలిక ఉన్నా, అవి ప్రతిపాదించే విషయాలలో వైరుధ్యం వుంటుంది.

**ఇది కాస్త వివరించండి**

కవిత్వానికి వస్తుపరిమితి లేదు. ఎలాంటి వస్తువునైనా స్వీకరించి దానిని కవిత్వం చేసే అవకాశం వుంది. హైకూకి, ముఖ్యంగా, ప్రకృతి మాత్రమే వస్తువుగా వుంటుంది. కవిత్వంలో ఎక్కువగా బైటి ప్రపంచానికి సంబంధించిన విషయాలుంటాయి. హైకూలో ఆంతరిక ప్రపంచానికి సంబంధించిన విషయాలు ఎక్కువగా ఉంటాయి. హైకూలో ఉన్నంత ప్రత్యేకమైన శ్రద్ధ, ఆంతరిక విషయాల మీద, కవిత్వంలో ఉండదు. అది ఎక్కువగా బైటి ప్రపంచం వైపు, బైటి ప్రపంచంలో వున్న వస్తు వైవిధ్యం వైపు దృష్టి చూపిస్తుంది.

**ప్రకృతి ఒక్కటే దీనిని బాగా వ్యక్తీకరించగలదా?**

ఆంతరిక ప్రపంచాన్ని ఆవిష్కరించటమే హైకూ లక్ష్యంగా కనిపిస్తుంది, జపాన్ హైకూలను చూస్తే. అలాంటి లోపలి ప్రపంచాన్ని ఆవిష్కరించటానికి సరైన మాధ్యమంగా ప్రకృతి ఒక్కటే కనిపిస్తుంది. బైటి ప్రపంచంలోని మిగతా వస్తువులు మన లోపలికి ప్రవేశించటానికి తగినవిగా

వుండవు.

**చాలామంది హైకూ అర్థంకాదు అంటుంటారు. ఈ విమర్శకు మీరేమంటారు?**

మనం అందమైన పూలని కానీ, సంధ్యాసమయాన్ని కానీ, వెన్నెలను కానీ చూసినప్పుడు, దానిని అర్థం చేసుకోవటం కంటే అనుభవించటానికి ప్రయత్నిస్తాం. ప్రయత్నించటం కూడా కాదు అనుభవిస్తాం. వెన్నెలను అర్థం చేసుకోవటం ఉండదు, పూలని అర్థం చేసుకోవటం ఉండదు. అలాగే హైకూని కూడా అర్థం చేసుకోవటం ఉండదు. దానిని అనుభవించాలి.

**పాఠకుడు ఆ స్థాయికి రాగలడా?**

ప్రశాంతమైన మానసిక స్థితి ఉండటం దీనికి ముఖ్యమైన అర్హత. చాలా గందరగోళాల మధ్య ఉన్నపుడు హైకూని చదివితే అది ఎలాంటి సందేశాన్ని ఇవ్వలేదు. మనం చాలా పనివత్తిడిలో ఉన్నపుడు చందమామ కిందనించి నడిచి వెళ్ళిపోతున్నా, మనం దానిని ఏ మాత్రం పట్టించుకోం. మనకు ఒక విధమైన ప్రశాంతత ఉన్నపుడే ఆ వెన్నెలని మనలోనికి తీసుకోగలుగుతాం. హైకూకి కూడా అలాగే ప్రశాంత మనఃస్థితి అవసరం.

**హైకూ చదవటానికే ఈ పరిస్థితి అవసరమైనపుడు, రాయటానికి ఎటువంటి పరిస్థితి కావాలి?**

కవిత్వంలో కాని, హైకూలో కాని కవి పాఠకుని కంటే భిన్నంగా ఉండడు. కవి తాను ఏ అనుభూతిని పొందుతాడో దానిని మాటలలోకి అనువదించి చెప్తాడు. పాఠకుడు ఆ పని చేయలేడు. అది ఒకటే వారిద్దరి మధ్యా భేదం. అనుభూతి పొందే విషయంలో ఇద్దరూ ఒకలాంటి సంస్కారాన్నే కలిగివుంటారు.

**హైకూ చదివే పాఠకులు కవి స్థాయిలో ఉండాలా?**

కొంతవరకూ అవసరం అవుతుంది; లేదా అటువంటి సంస్కారాన్ని కలిగించుకోవచ్చు కూడా. ఇది పాండిత్యం వల్ల వచ్చే అర్హత కాదు. మన మానసిక స్థితి మీద ఆధారపడిన అర్హత ఇది. ఎంత ప్రశాంతంగా ఉండగలిగితే, అంతగా హైకూ చదవటానికి అర్హత ఉంటుంది.

**హైకూ అంటే మూడు లైన్లలో కనబడేదేనా? దానికి ఏమైనా కొలబద్ద ఉందా? జపాన్ హైకూ ఎలా ఉంటుంది?**

హైకూని జపాన్‌లో మొదట ఆవిష్కరించిన కవి బషో. ఆయన మొదట రాసినపుడు 5,7,5 మాత్రలలో రాసారు. అయితే ఎపుడైనా మాత్రలలో ఒదగనట్లైతే, దానిని విడిచిపెట్టారు. అది ఇతర దేశాలకు వ్యాపించినపుడు మాత్రా ఛందస్సుపై వాళ్లు అంతగా శ్రద్ధ పెట్టలేదు. అయితే దాని సారాంశం ఏమిటంటే, చాలా తక్కువ మాటల్లో, చెప్పదలిచిన దానిని చెప్పటం. అందువల్ల సంక్షిప్తత హైకూకి అవసరం.

**మినీకవిత కూడా సంక్షిప్తంగా ఉంటుంది కదా?**

మినీకవితకీ, హైకూకీ వస్తువులోనే భేదం కనిపిస్తుంది. మినీకవిత బైటి విషయాల గురించి మాట్లాడుతుంది. హైకూ లోపలి విషయాల గురించి మాట్లాడుతుంది.

**మినీకవిత అంతర్గతభావాలను చిత్రించలేదా?**

మినీకవిత కొన్నిసార్లు అలాంటి ప్రయత్నాలను చేసింది. వాటిలో కొన్ని హైకూ తత్వాన్ని పోలినవి ఉండవచ్చు. రాసిన కవులు వాటిని మినీకవిత అనే ఉద్దేశంతో రాసినపుడు, అవి ఆ విధంగానే చదువుతాము.

**హైకూ జపాన్‌లో మొదలైంది, తరువాత కాలంలో దాని పరిణామక్రమం ఏమిటి?**

రూపానికి సంబంధించి అది సంక్షిప్తంగా ఉండటం ముఖ్య లక్షణంగా వుంది. అందువలన ఇతరదేశాలకి వ్యాపించినపుడు కొందరు ఒకలైను, రెండులైన్లలో కూడా హైకూలని రాసారు. సారాంశానికి సంబంధించి మాత్రం ప్రకృతి, ఆంతరిక విషయాలు ఉండటమే దాని ముఖ్య లక్షణంగా వుంది. తరువాత దానికి కూడా కొంతమంది కొంత వెసులుబాటు చేసుకొన్నారు.

**కొందరు ఈ మూడులైన్లలో రాసినా, హైకూనా, కాదా అని సందేహం వచ్చేవిధంగా రాస్తారు.. అలాంటపుడు అది హైకూనా, కాదా అని ఎలా తెలుస్తుంది?**

అది మనకి ఇచ్చే అనుభవాన్ని బట్టి, అది హైకూనా, కాదా అనేది తెలుస్తుంది.

**అనుభవం సాపేక్షికం. ఒక కవిత మీరు మీ స్థాయిలో అనుభూతి చెందితే, నేను నా స్థాయిలో అనుభూతి చెందుతాను. వైయక్తికమైన తేడాలు వుంటాయి కదా?**

హైకూ మనం శుభ్రపడుతున్న అనుభూతినిస్తుంది. చాలా నిర్మలంగా, ప్రశాంతంగా ఉన్న అనుభూతులనిస్తుంది. అది మిగతా హైకూలలో లేనపుడు, అది హైకూ కాదని చెప్పవచ్చు.

**క్లుప్తత, ప్రకృతి అంశం గా ఉండటం, ఈ రెండూ కాకుండా ఇంకేమైనా అవసరమా?**

సరళంగా చెప్పవలసిన అవసరం వుంది. హైకూలో ధ్వని లేదా అలంకారం వంటి కవితాపరమైన అంశాలు - ఎక్కడైనా అవసరమైతే కాని - ప్రవేశపెడితే హైకూ అందించాల్సిన అనుభవం దెబ్బతింటుంది.

**కవికి ఇంకేమైనా ప్రత్యేక అర్హతలు ఉండాలా?**

మానసిక ప్రశాంతత కవికి స్వయంగా అనుభవంలో ఉండాలి. తర్వాత తనచుట్టూ ఉన్న వాతావరణాన్ని, ప్రపంచాన్ని ప్రేమించటమనే లక్షణం ఉండాలి.

**ప్రేమించటం అంటే, గుణాత్మక దృష్టి ఉండాలంటారు?**

అవును. గుణాత్మకంగా ఉండటం.. దయ కలిగి ఉండటం..

**ఇప్పుడు చాలా రకాల వాదాలు ఉన్నాయి కదా. వీటి కన్నా హైకూ భిన్నమైనదనే చెప్పాలి. అవునా?**

అవును.

**ప్రస్తుతజీవితం చాలా యాంత్రికమైపోతుంది. ఉరుకులూ, పరుగులనీ, క్షణక్షణగండం అనీ, నిత్యసమరమనీ అనుకొంటాం. ఇటువంటి జీవితంలో హైకూలు రాయటం, చదవటం, అనుభవించటం వీలవుతుందా?**

వీలవుతుంది.

**ఎలాగ?**

అవ్వాల్సిన అవసరం వుంది. మనిషి మౌలికంగా ఆనందం కోసమే జీవిస్తున్నాడు. అలాంటి ఆనందం పొందటానికి లేదా అలాంటి ఆనందంలోకి మేలుకోవటానికి ఇది ఒక మాధ్యమంగా ఉంది. అవకాశం ఉందా అనేది.. దానిని వాళ్ళు కలిగించుకోవటంమీద ఆధారపడి వుంటుంది.

**బషో మొదలు పెట్టినపుడు పరిస్థితి వేరు కావచ్చు. ఇప్పుడు సమాజం ఇంత త్వరగా మారిపోతున్నపుడు, ఎప్పుడూ ఉరుకులు, పరుగులుగా ఉన్నపుడు మీరు చెప్పినట్టు ప్రశాంతంగా కూర్చుని, ప్రశాంతంగా ఆలోచించే అవకాశం.. కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి మారతాయి. ఈ నేపథ్యంలో హైకూల అవసరం పెరిగిందా, తగ్గిందా?**

ఇంకా ఎక్కువ పెరిగింది. ఎందుకంటే మనిషి క్రమంగా, నిజంగా తనకి ఏమి కావల్సిందీ మరిచిపోతున్న సందర్భం ఇది. ప్రొద్దుట లేచింది మొదలు ఆర్థిక అవసరాలు లేదా భౌతిక ప్రయోజనాలు.. ఇలాంటి వాటి కోసమే మనిషి అదే లక్ష్యాలతో జీవిస్తున్నాడు. అయితే ఇవన్నీ తానెందుకోసం చేస్తున్నాడు? వీటన్నిటి వెనుకా వున్న తన మౌలిక అస్తిత్వానికి కావలిసిందేమిటి? అది తను పొందుతున్నాడా, లేదా? ఇలాంటి ప్రశ్నలే ఇవాళ కలగటంలేదు. మనిషికి మౌలికంగా కావలసింది ఆనందం. ఆ విషయాన్ని హైకూ గుర్తుచేస్తుంది. అలాంటి ఆనందాన్ని ఇవ్వటానికి ప్రయత్నం చేస్తుంది.

**ఆనందం కూడా వైయక్తికం. ఒక్కొక్కరు ఒక రకంగా ఆనందాన్ని నిర్వచిస్తారు. హైకూ దృష్టిలో ఆనందం అంటే భావనరీత్యా ఎట్లా తీసుకోవాలి?**

ఆనందం మన కోరికను బట్టి సాపేక్షికంగా అనిపించినా, అంతిమంగా మనలో నిజమైన ఆనందం అంటే స్వచ్ఛమైన ఆనందం ఎవరిలో చూసినా ఒకలాంటి అనుభవాన్నే కలిగిస్తుంది. కోరికలద్వారా కలిగే సంతోషం, సుఖం వంటివి వేరుకావచ్చు. అంతిమంగా మనలో ఉండే ప్రశాంతత – శాంతి అనండి – కోరికలు లేని స్థితి, ఒక తటస్థస్థితి ఉ

ంటుంది. అది నిజమైన ఆనందంగా చెప్తారు. అలాంటి ఆనందం కోసం హైకూ ప్రయత్నం చేస్తుంది.

**హైకూలు అర్థంకావు అన్న పాఠకులకి అర్థం చేసుకోవటానికి మీరు ఏమైనా చెప్తారా?**

అర్థం కావటం కంటే అనుభూతి చెందటానికి ప్రయత్నించటం ముఖ్యం.

**ఒక రకమైన సాధన అంటారా?**

కొంత అలాంటి సంస్కారం ఉండాలి. ఉంటుంది కూడా. చిన్నపుడు చందమామని, వానని లేదా వెన్నెలని, వీటన్నిటినీ చూసి ఆనందించని వాళ్ళంటూ ఎవరూ ఉండరు. అదే ఏ మనిషికైనా ఉండే అర్హత, హైకూ చదవటానికి కూడా. పెద్దయే కొద్దీ మనకుండే సంఘర్షణల వల్ల అలాంటి జీవలక్షణాన్ని కోల్పోవటం జరుగుతుంది. మళ్ళీ తాను బాల్యంలోకి ప్రవేశించగలిగితే హైకూని చాలా బాగా ఆనందించగలుగుతారు.

**ఇప్పుడు తెలుగులో హైకూ సాహిత్యం గురించి. తెలుగులో హైకూ ఎప్పుడు మొదలైంది. నేరుగా వచ్చిందా, అనువాదంగా మొదలైందా. సంక్షిప్తంగా చెప్పండి.**

తెలుగులో హైకూలు మొదట అనువాదంగా వచ్చాయండి. డాక్టర్ సంజీవదేవ్‌గారు ఒక వ్యాసంలో జపాన్ సంస్కృతి గురించి తెలియచేస్తూ కొన్ని హైకూ అనువాదాలని రాసారు. తరువాత వాడ్రేవు చిన వీరభద్రుడు నిర్వికల్ప సంగీతం సంకలనంలో హైకూని పరిచయం చేస్తూ కొన్ని పరిచయవాక్యాలు రాసారు. తరువాత తెలుగులో నేరుగా స్వంత హైకూలు రాసిన మొదటికవి గాలి నాసరరెడ్డి, 89–90 ప్రాంతంలో. తరువాత ఇస్మాయిల్‌గారు 91లో స్వంతంగా రాసిన హైకూలు పత్రికల్లో వచ్చాక, హైకూకి ఒక్కసారిగా విశేషమైన గుర్తింపు వచ్చింది. దానితో చాలామంది ప్రసిద్ధులు కానీ, కొత్తవాళ్ళు కానీ హైకూలు రాయటానికి, చదవటానికి ఆసక్తి కలిగింది. స్మైల్, సదాశివరావుగారు వంటి ప్రముఖులు కొన్ని హైకూ అనువాదాలని పత్రికలలో ప్రకటించారు. తరువాత దాదాపు 10–12 మంది

కవులు, కొత్తవాళ్ళు హైకూలతో కవిత్వంలోకి ప్రవేశించారు.

**హైకూ రాయాలంటే ఒక ప్రత్యేకమైన దృక్పథం, అభిరుచి ఉన్న కవులే రాయగలరన్నారు. చదవాలనుకొన్నవారికి అలాంటి స్థాయీ దృక్పథం ఉండాలన్నారు. మరి హైకూలు రాసే కవులు, మిగతా కవుల కన్నా భిన్నంగా ఉంటారా?**

హైకూ అంటే తాను స్వయంగా అనుభవించి రాసింది. ఇది subjective poetry (వ్యక్తిగత కవిత్వం) అనవచ్చు. subjective poetry రాసేవారెవరైనా, సాధారణంగా వాళ్ల కవిత్వానికి దగ్గరగానే జీవిస్తుంటారు. objective poetry (వస్తుగత కవిత్వం) లో అలా ఉండాలని లేదు. తాను రాసేది వేరు కావచ్చు, తాను జీవించేది వేరు కావచ్చు.

**ఇక్కడ వైరుధ్యం తక్కువ వుంటుందా?**

అవును.

**తెలుగులో హైకూలు రాస్తున్న కవులలో మహిళలు ఉన్నట్లులేరు. ఎందువల్ల?**

కొత్తగా రాస్తున్నవాళ్ళలో కొంతమంది అమ్మాయిలు రాస్తున్నారు. senior poets లో మగవాళ్ళలో కాని, ఆడవాళ్ళలో కాని.. వాళ్ళిప్పటికే వేరే రూపం సాధన చేసి ఉండటం వలన కావచ్చు.. హైకూవైపు ఎవరూ దృష్టి పెట్టలేదు. ముందుముందు తరాలలో ఆడవారినీ, మగవారినీ కూడా సమానంగా ఈ ప్రక్రియలో ఆశించవచ్చును.

**జపాన్‌లో ఎలా ఉంది పరిస్థితి. అక్కడ హైకూలు రాసేవాళ్ళలో ఇలాంటి ప్రత్యేకత, వైరుధ్యం ఏమైనా కనబడుతుందా?**

అక్కడకూడా అలా ఉన్నట్టులేదు. జపాన్ సంస్కృ తిలో హైకూ చాలా బాగా కలిసిపోయినట్లు కనిపిస్తుంది. దీనివల్ల హైకూ మనిషిలో సౌందర్యదృష్టి ఆవిష్కరిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా, అందంగా చూడటం తెలుస్తుంది.. హైకూ రాయటం వల్ల, లేదా అలాంటి దృష్టి ఉ ండటం వల్ల అనేది తెలుస్తుంది.

**హైకూలు రాసే కవులు, వేరే రూపంలో రాసిన సందర్భాలున్నాయా?**

హైకూలో చెప్పలేని అంశాలున్నాయి. హైకూకి ఉన్న పరిమితులు ఇందాక చెప్పుకొన్నాం. ఆ పరిధుల్లో ఇమడని వస్తువులు ఏమైనా కవిత్వం చేయాల్సివచ్చినపుడు, హైకూ కాని రూపంలో, వచనకవిత్వంలో చెప్పడం కొందరు కవులు చేస్తున్నారు.

**జపాన్‌లోనా?**

జపాన్ విషయం తెలియదు. తెలుగులో అలాంటి ప్రయత్నం జరుగుతోంది.

(ఆల్ ఇండియా రేడియో, విజయవాడలో జనవరి 2000 ప్రాంతంలో జరిగిన ఇంటర్వ్యూ సంక్షిప్తరూపం)

# మౌనానికి ముందుమాట

బివివి ప్రసాద్

ఒక బౌద్ధసన్యాసి అనేక శాస్త్రవిషయాలు తెలుసుకొని, సాధనలు చేసి కూడా సత్యానుభవం పొందలేకపోతాడు. అతడు ఒక కొండమీది పురాతన దేవాలయంలో సత్యానుసంధాన దృష్టితో కాలం గడుపుతున్నపుడు, ఒకరోజు యాదృచ్ఛికంగా దేవాలయపు గంట మ్రోగుతుంది. ప్రశాంత నిశ్శబ్ద వాతావరణంలో అకస్మాత్తుగా వినవచ్చిన ఆ శబ్దం అతనికి సత్యస్ఫురణని కలిగిస్తుంది. హైకూ అటువంటి ధ్యానకవిత.

ధ్యానం అంటే మనలోంచి అపారంగా ప్రకటమౌతున్న మౌనం పట్ల ఎరుక కలిగివుండటం. మౌనంలో కరిగిపోవటం. తాను మౌనం అయిపోవటం. హైకూ అంటే మనలోపలి, వెలుపలి రణగొణధ్వనుల ప్రపంచంలోంచి అటువంటి మౌనంలోకి నడిచివెళ్ళటం. హైకూ అంటే మౌనంలోకి కదిలే చివరి అడుగు.

హైకూ కేవలం రూపసంబంధమైన ప్రక్రియ కాదు. ఆంతరిక అన్వేషణకీ, సారానికీ సంబంధించినది. కవినీ, పాఠకునీ అంతర్ముఖుని చేయని, కనీసం అటువంటి ప్రయత్నం చేయని త్రిపద రాసి, హైకూ అనటం, ఒక ఉదాత్త సాహిత్య ప్రక్రియను గౌరవించటం కాక, అగౌరవపరచటం అవుతుంది.

హైకూ నిజానికి ఏకవాక్య కవిత. వాక్యంలో విభాగాలను, విభాగాల ద్వారా పాఠకునికి కలిగించదలిచిన అనుభూతి సాంద్రతని దృష్టిలో ఉంచుకొని చేయవలసి ఉంటుంది. అంటే వాక్య విరామాలు కూడా పదాలవలే జాగ్రత్తగా ఎంపిక చేసుకోవలసి ఉంటుంది.

హైకూ మనని ఆంతరిక మౌనం పట్ల మేలుకొల్పాలి గనుక, హైకూని వ్యక్తీకరించటానికి స్వీకరించే శబ్దాలు, శబ్దాల సంఖ్య – మౌనానికి దూరం చేసేవిగా కాకుండా, దగ్గర చేసేవిగా ఉండాలి. ఎవరైనా హైకూలు

రాయటానికి ప్రయత్నించటం హర్షణీయం. అయితే హైకూని కవి తన స్థాయికి తీసుకువచ్చే ప్రయత్నంచేస్తూ రాయటానికి బదులు, తాను హైకూ స్థాయికి ఎదగటానికి ప్రయత్నం చేస్తూ రాయాలి. హైకూ ఉదాత్తతనీ, హైకూ ద్వారా తాను అందుకోవలసిన మౌనాన్ని దృష్టిలో ఉంచుకొని రాయాలి.

ఒక మంచి హైకూ రాయటం, మనసులో ఏ ఆలోచనా కదలకుండా ఉండటమంత కష్టం. సులువు. ఒక హైకూ తననీ, పాఠకునీ ఏంచేయాలో స్పష్టంగా గ్రహించిన కవి, అటువంటి హైకూని దర్శించటానికి ప్రయత్నిస్తూ వుంటే, ఎప్పుడైనా ఒకసారి మెరుపువలే ఒక పరిశుద్ధమైన హైకూ స్ఫురించవచ్చును. ఒక జపనీయ హైకూ కవి 'జీవితమంతటిలోకీ ఒక హైకూ రాయగలిగితే చాలును' అన్నట్లు చెబుతారు. అవి హైకూ ఉదాత్తతనీ, పరమలక్ష్యాన్నీ గుర్తించి అన్న మాటలు.

రామకృష్ణగారు ప్రధానంగా కవి. ప్రతిపూవుకీ, మరొకపూవుతో పోల్చరాని తనదైన అంతర్గత సౌందర్యనిర్మాణం వుంటుందనిపిస్తుంది, అట్లాగే రామకృష్ణగారిలోంచి వ్యక్తమయ్యే కవిత్వసౌందర్యం కూడా. ఏ తరగతి కవికి అయినా కావలసిన భావనాశక్తితో పాటుగా, రామకృష్ణగారిలో హైకూ కవికి అవసరమైన సున్నితత్వం, సౌందర్యదృష్టీ గోచరిస్తూవుంటాయి. కవిత్వంతో పాటుగా, అపుడపుడూ రాసిన హైకూలని రామకృష్ణ ఇపుడు సంకలనంగా తీసుకువస్తున్నారు. బహుశా ఆయన హైకూ తత్వాన్నీ, లక్ష్యాన్నీ గ్రహించే క్రమంలోనే ఇవి రాశారనుకొంటాను. అక్కడక్కడా కొన్ని హైకూ ఇవ్వవలసిన నిశ్చలమౌనానుభవానికి సమీపంగా తీసుకువెళతాయి, మిగిలినవానిలో ఎక్కువభాగం తమదైన సౌందర్యంతో మనకు రసానుభూతిని ఇస్తాయి.

ధాన్యరాశుల కాపలాదారు
గింజలేరుకుంటున్న
పిచ్చుకను చూస్తున్నాడు

పిచ్చుకను తరమటానికి బదులు చూస్తూవుండిపోయాడు. తనని మరచి ఇతరజీవుల అస్తిత్వంతో ఏకం కావటమే హైకూ.

గదినుండి
చీకట్లోకి ఎగిరిపోయింది
సీతాకోక

దృశ్యం తటాలున అదృశ్యంలో కరిగిపోవటమే హైకూ.

దారితప్పిన చిన్నారి
జామపండు తింటూ
కాసేపు తనని మరిచిపోయాడు

భయం మరచి వర్తమానక్షణంలో జీవించటమే హైకూ.

కప్పు అరుపు మధ్య
తప్పించుకు తిరుగుతోంది
మిణుగురు

వెలుపలినుండి లోపలికి అడుగువెయ్యటమే హైకూ. వెలుపలి కప్పఅరుపు, మిణుగురు వెలుగు రెండు దృశ్యాలు, లోపల రెండూ ఒకే దృశ్యం.

ఈ పుస్తకం పాఠకులకి సంతోషాన్ని కలిగిస్తుందని నమ్ముతున్నాను.

(గోపిరెడ్డి రామకృష్ణారావు హైకూ సంపుటి 'వెన్నెలగా వుంది' ముందుమాట: 4.1.2005)



bvv prasad haikoolu

ఇవాళ వుదయం లక్ష హడావుడి పనులు ముగించుకుని, ఆఫీసుకు వెళ్లటానికి తయారై- నాతోపాటు వస్తానన్న స్నేహితురాలి కోసం యెదురు చూస్తూ, పెరిగిన బి.పి.తో, పనులు సకాలంలో, సక్రమంగా పూర్తికావేమోనన్న ఆందోళనతో వేయి దిగుళ్ళతో, వంద భయాలతో సతమతమవుతూ అనుకోకుండా మీ రాలినపూలను చేతిలోకి తీసుకున్నాను.

ఇపుడు ఈ క్షణాన యెంత నిర్లిప్త ప్రశాంత దు:ఖమో మనసునిండా. దు:ఖం బాధతో కాదు. ఆనందంతోనూ కాదు. యెందుకో నాకు నిజంగా తెలియదు. తెలియాల్సిన అవసరమూ లేదు. ఈ హృదయానుభూతి బాగుంది. ఈ పుస్తకం ప్రతులు ఒక వందకొని నాకోసం పది వుంచుకుని మిగిలినవి నా ప్రియ మిత్రులందరికీ కానుకగా యిస్తాను.

ఒక చక్కని చల్లని స్నేహమయమైన పరిసరాలను యెక్కడైనా యెప్పుడైనా మనుషుల చుట్టూ సృష్టించగల శక్తి రాలిన మీ కవితాకుసుమాలకు వుంది. మానవులను సేద దీర్చటానికి ప్రకృతి సమకూర్చిన అపురూప వరాలన్నిటినీ ఒక చిన్ని పుస్తకంలో పేర్చి ప్రకృతిని అనాలోచితంగా, నిర్దయగా, నిర్లజ్జగా ధ్వంసం చేసిన మానవజాతికి యెంతో ప్రేమతో యిచ్చారు మీరు.

మీ మనసులో మానవులమీది ప్రేమను అలాగే నిలుపుకోండి. నిలుపుకుంటారు.

యెంతో ఆప్యాయంగా, స్నేహంగా

ఓల్గా

5-1-2000